## పెద్ద కథ ప్రారంభం !

**ఈ పెళ్ళి తనకు బొత్తిగా ఇష్టంలేదు. అలా అని "ఈ పెళ్ళి చేసుకోను"-అని తలిదండ్రులకు చెప్పే స్థితిలో లేడు మాధవ్. తను ప్రేమలో పడి మరో అమ్మాయిని ప్రేమించి ఈ పెళ్ళి ఒద్దు అనుకోటానికి అసలు తను ఎవ్వరినీ ప్రేమించలేదు.**

విష్ప్రహలో పరాకుగ ఆఫీస్ నుండి బైటికొచ్చాడు. వెంటవే ఇంటి కెళ్ళాలనిపించలేదు. కాంటీన్‌లో కాఫీ త్రాగి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. కాస్త దూరం వెళ్ళేసరికి టైలర్ షాపులు వచ్చాయి.

పెద్ద కథ

# ప్రాణకని స్వప్నం

## కోమలాదేవి

క్రొత్త బట్టలతో నిలవుటద్దాలతో ఆ దుకాణాలు నిండుగా అందంగా కలకల లాడుతున్నాయి ఒక అద్దంలోని ప్రతిబింబం చూచి తక్కున ఆగిపోయాడు మాధవ్

ఆ ప్రతిబింబం ఐదడుగుల పదిన్నర అంగుళాల ఎత్తులో ఉంది. పసిమిఛాయలో ఉన్న రంగు ఎండకు కాస్త కమిలినట్లుగా ఉంది. వంకీలు తిరిగిన ఒత్తైన జుత్తు చెవులనుదాటి సగం మెడను కప్పుతూ వంపుతిరిగి వుంది. వంకలేని తిన్నని ముక్కు, అందంగా వంపుతిరిగిన సన్నటి చిక్కని కనుబొమలు, అధునాతన మీసంకట్టు, కళ్ళకు కూలింగ్ గ్లాస్ పెట్టుకున్న ఆ వ్యక్తి మేగజైన్స్‌లో మోడల్‌లా ఉన్నాడు. తన ప్రతిబింబాన్ని చూచు కుంటూ కొంతసేపు ఆనందించాడు. అలా నుంచుని చూచుకుంటే బావుండదని టై ముడి సర్దుకుని దాటిపోయాడు...గుండెల్లో మంట రాజుకుంటోంది.

ఆతడి మనసులో గుబులుగా ఉంది. తను ఎంత అందంగా ఉన్నాడు ! "సినిమాలో జేరావంటే గొప్ప హీరోవి అయిపోతావురా" అని తన స్నేహితులు అనటం గుర్తుకు వచ్చింది. అంతే ఆతడిలో పట్టుదల హెచ్చింది. తను ఈ పెళ్ళికి ఒప్పుకోడు. "నేను చేసుకోను" అని ఖచ్చితంగా చెప్పేయాలి. తన మెడలు వంచి కట్టి పడేయలేరు. తను చూస్తూ చూస్తూ... ఆమెను పెళ్ళి చేసుకోలేడు. తన ఊహా సుందరిని ఓమారు గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆమెను తన ప్రక్క నుంచో బెట్టుకుని తన్మయుడయ్యాడు. తన ముక్కుతో ఆమె ముక్కును పోల్చుకున్నాడు. సంపంగి మొగ్గలా ఉంది! ఆమె చిరుకోపం ప్రదర్శిస్తే ముచ్చటగా ఆ ముక్కును పట్టుకుని ఊపుతూ మెల్లగా తన దగ్గరకు లాక్కుని అరవిచ్చిన పెదిమలమీదికి ఆత్రంగావంగుతాడు. ఆమె కోపంతో వెనక్కి తీసుకుంటుంది – క్రోధం నటిస్తుంది. ఆ వాడి చూపులు తన హృదయాన్ని రంజిపజేస్తాయి. ఆమె పొడవైన జడను నా చేజిక్కించుకుని విసురుగా దగ్గరకు లాక్కుని ఆమె నడుము పిడికిట్లో చిక్కించు కున్నంత సులభంగా అందుకుంటాడు. ఆ విసురుకు ఆమె తనను హత్తుకుపోతుంది. కిలకిలనవ్వుతుంది. ఆ నవ్వును అందుకుంటాడు. ఆమె సుకుమారమైన కపోలాల్లో తన ప్రతిబింబం చూచుకుంటాడు. అబ్బ – ఎంత చక్కటి ఈడు జోడు–అని అందరు అనుకుంటారు. ఆ స్వాప్నిక జగత్తునుండి జారి క్రింద పడ్డట్లు ఎవరో హార్న్ పదేపదే మ్రోగించారు.

ప్రక్కకు తిరిగి చూచాడు – స్నేహితుడు రాజా మోటర్‌బైక్‌మీద ఉన్నాడు.

"ఎక్కురా ... అలా తిరిగి వద్దాం."

"ఏం ? ఈరోజు మీ ఆవిడ పర్మిషన్ ఇచ్చిందా ?" అన్నాడు ఎక్కికూర్చుంటూ.

"వాళ్ళ ఫ్రెండ్ కొడుకు పుట్టినరోజు రేపు. కేక్ చేయటానికి సహాయంగా వెళ్ళింది ?"

"కనుక నీవు ఫ్రీగా ఉన్నావన్నమాట ?" మాధవ్ అన్నాడు.

"ఈ ఫ్రీడం ఎలాంటిదంటే పెళ్ళయితేగాని దీని విలువ నీకు తెలీదు. అన్నట్లు నీ పెళ్ళి సెటిల్ అయినట్లేనా ?"

"అని మా వాళ్ళనుకుంటున్నారు. కాని నేను ఒద్దు అనబోతున్నాను."

"వ్వాట్ ... పద ఎక్కడైన కూర్చుందాం."

నిర్మానుష్యమైన చోటికి వెళ్ళాలంటే మహా నగరాల్లో వీలుపడదు. అందుకని ఒక కూల్‌డ్రింక్ షాప్ దగ్గర ఆగారు. డ్రింక్ తీసుకుని ఒకచోట కూర్చున్నారు.

"ఏమిటి సంగతి. పిల్ల – డబ్బు – ఏది బాగ లేదు ?" రాజు తాపీగా అడిగాడు.

"పిల్ల" అన్నాడు మాధవ్ పొడిపొడిగా.

"పిల్ల ...! అంటే అమ్మాయి ...! నీ కాబోయే భార్య ...! నో ... నో ... అసంభవం ... తమాషా చెయ్యకు. నిజం చెప్పు."

"నిజం ..."

"మరి డబ్బు ?"

"మా కష్టాలు గట్టెక్కుతాయట... ఇదేం న్యాయం రాజా ? నన్ను నుంచున్న పళంగా ఏడు బావుల లోతున్న నూతిలోకి త్రోసివేసి వాళ్లంతా గట్టెక్కుతారట... నేను సహించలేకపోతున్నానురా. ఏం చెయ్యాలో తోచదు."

"నీ దృష్టిలో మరో అమ్మాయి వుందా ?" ఆత్రంగా అడిగాడు.

"లేదు... ప్రేమించటానికి టైం ఏదీ ? స్టూడెంట్ డేస్‌లో ఎవరినైనా వెంటేసుకుని తిరగ టానికి డబ్బేదీ ? కనీసం పిక్చర్‌కు తీసుకెళ్ళాలన్నా ధైర్యం చాలేది కాదు. నీకు తెలుసుగా అతి మామూలు గుడ్డలతో కాలేజి చదువు వెలగ బెట్టాను...డబ్బులేదని–నేనే ఈ ప్రేమాయణం.."

"అది సరేగాని– అమ్మాయి అంత బాగుండదా ?"

"ఏం చెప్పను ? నాకు నచ్చలేదు "

"నీ ప్రక్కన దిష్టిబొమ్మలా వుంటుందా?"

"ఉంటుంది."

"నో... నో... నీవు హాస్యానికి అంటున్నావు. మన నవలల్లో మన సినిమాల్లో ఐశ్వర్యవంతులబిడ్డ అత్యంత రూపవతిగా వుండాలే... ఒరేయ్– ఇది ఏప్రిల్ ఫస్ట్ కాదు..."

"నీవు నమ్మవు. అంతా నిజమే చెబు తున్నాన్రా "

"నేను వచ్చి చూచేదా ?"

"ఒద్దు... మర్యాదగా వుండదు."

"ఫోటో ఉందా ?"

"లేదు."

"ఇదే ఊరా ?"

"ఆ."

నిన్ను చూస్తే జాలేస్తోంది. కాని నువ్వు తల వంచకూడదు. ఇది ఒక్కనాటి ముచ్చట కాదు... కళ్ళు మూసుకుని... అబ్బ తాళి కట్టేశాను... ఇక

ఫరవాలేదు... అని అనుకునే పరిస్థితి కాదు. అనుక్షణం ఈ బంధం బలపడ్తూ ఉంటుంది. నువ్వు ఒదిలించుకోవాలన్నా ఒదిలించుకోలేవు... నిజం చెప్పాలంటే డబ్బుకు అమ్ముడుబోయాక మన వ్యక్తిత్వపు విలువ ఏముంటుంది. అందులో వాళ్ళు బాగా ఉన్నవాళ్ళంటున్నావు. కనుక...ఒదిలించుకో... చేసుకోను అని చెప్పు. అది నిష్ఠురం మేలు.''

''థాంక్సురా... నాకు ధైర్యంగా ఉంది. ఇప్పుడే వెళ్ళి చెబుతాను'' రాజా మాధవ్‌ను ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోతూ ... ''గుడ్‌లక్'' అన్నాడు.

మాధవ్ తలుపు త్రోసుకుని లోపలికెళ్ళాడు. అంతా వంటగది బైటజేరి కాఫీ త్రాగుతున్నట్లున్నారు. మెల్లగా మంచంమీద కూర్చున్నాడు.

తల్లి అంటుంది... ''ఈ ఇంటిని రిపేర్ చేయించాలిట.''

''బాబోయ్... ఈ ఇంటిని రిపేర్ చేయించటానికయ్యే ఖర్చుతో మరో ఇల్లే వస్తుంది'' అంది కుసుమ—పెద్దచెల్లి.

''ఎవడికోసం చేయిస్తాడు ? తన ముద్దుల కూతురు వుండటానికి చేయిస్తాడు. ఆ చక్కనమ్మకు ఈ డొక్కు ఇల్లు పనికిరాదుగా. చక్కగా మోడర్న్‌గా చేయించనీ... హాయిగా వుందాం.'' తమ్ముడు కేశవ్ గలగల నవ్వుతూ అన్నాడు.

కట్నం డబ్బులోనే ఈ ఇంటి రిపేర్ డబ్బు కూడా వుందా ? లేక వేరుగా ఇస్తాడా ?'' చిన్నచెల్లి సుమలత అంది.

తండ్రి కంఠంలో ఏనాడు వినబడని గర్వం ధ్వనించింది.

''దానికి దీనికి పొత్తులేదు. దేనికదే... అన్నాను. మీ అమ్మాయికి అనుకూలంగా వైభోగంగా ఉండేట్లు చేయిస్తాను. కాని అదంతా మీరే చూచుకోవాలి అని ఖచ్చితంగా చెప్పాను. ఏం చేస్తాడు? సరేనండి... అన్నాడు.''

''సరేనండి బావగారూ... అలాగే ఇస్తాను'' కేశవ్ మిమిక్రీచేసి చెబుతుంటే అంతా ఘొల్లున నవ్వారు.

''అన్నట్లు కుసుమకు చూసిన సంబంధం ఏమైంది?'' తల్లి ఆత్రంగా అడిగింది భర్తను.

''కుసుమకు నచ్చలేదుట ... ఒద్దని రాసెయ్యాలి.''

మాధవ్ చకితుడయ్యాడు. టెలిఫోన్ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. చూడటానికి బాగానే ఉంటాడు. హైద్రాబాద్‌లో స్వంత ఇల్లు కూడా ఉంది. అందరిలోకీ చిన్నవాడు. అందరికి పెళ్ళయిపోయింది. ఐదువేలు మాత్రం అడిగారు. దాదాపు ఒప్పుకున్నట్లే అనుకున్నారు. ఇప్పుడీవిధంగా అంటున్నారేమిటి ? ఒకవేళ తను తీసుకునే డబ్బు లోంచితీసి పెద్ద కట్నం ఇచ్చి పెద్ద ఉద్యోగస్తుణ్ణి తేవాలనుకుంటున్నారా? అంతే...

ఈ సంబంధమైనా స్థిరమైతే బావుండును—అని ఇంటిల్లిపాది కోరుకున్న రోజులు విస్మరించారా?

ఈ పెళ్ళికి తను అంగీకరించి వీళ్ళను ఉద్ధరిస్తున్నాడా ? లేకవారిని అత్యంత ఆశకు లోను చేస్తున్నాడా ?

''అమ్మా — పెళ్ళికి నాకు ఎరుపు రంగు పట్టుపరికిణి కొనాలి. దానికి మాచింగ్‌గా ఎఱ్ఱఅపాళ్ళు—




ముత్యాల నెక్లెస్ కావాలి'' సుమలత గారాలు పోతూ తల్లిని అడిగింది.

''సరేలే ... ఇప్పుడెందుకు. నీ పెళ్ళికి కొంటాను'' అందామె.

''అప్పుడు కూడ పరికిణీయే కట్టుకోనా ?'' అంది కిసుక్కున నవ్వి. అంతా గలగల నవ్వేశారు.

''వాళ్ళు అన్నయ్యకు కారిస్తారు—నువ్వు నాకు స్కూటర్ ఇవ్వాలి'' కేశవ్ తన కోర్కె వెలిబుచ్చాడు.

''అలాగే ... ఎనిమిదివేలేగా ?'' తండ్రి గోపాలరావు లెక్కలేనట్లు అంటూ ఉంటే మాధవ్ ఇంకా ఆశ్చర్యపోయాడు. ఔను—లేమిలో — ఒద్దు—లేదు — చాలదు — సర్దుకో అన్నమాటల మధ్య పెంచిన తండ్రి ఈ ఒక్కసారి హాయిగా ''అట్లాగే'' అనటంలో ఎంత ఆనందం ఉన్నదో ! పిల్లల కోర్కె తీర్చటానికి ఈ తండ్రి ఎంతగా శ్రమించాడు ? ఈనాడు దర్జాగా ప్రవర్తిస్తుంటే మాధవ్‌కు తన త్యాగంలోని గొప్పతనం అర్థమైంది. పెద్ద ఉద్యోగస్తుడు—పట్టుపరికిణి—నెక్లెస్—స్కూటర్... అసలు ఇలాంటి మాటలు ఆ గృహంలో నిషేధింపబడినట్లు వినబడేవికావు.

''నాన్నా నువ్వు చాల మంచివాడివి'' కేశవ్ పట్టరాని ఆనందంతో అన్నాడు.

''నా మంచితనం కాదురా. మాధవ్ మంచితనమే. మన అందరి కోసం ఈ పెళ్ళికి ఒప్పుకున్నాడు. అతడికన్నా మనం ఐదుగురం ఈ పెళ్ళి వలన లాభం పొందుతాము. మాధవ్‌ను ఇలాంటి సంబంధం తెచ్చి బంధించటం నా కిష్టంలేదు. కాని నేను చేతకానివాడినైపోయాను. మరో మార్గం లేదు'' తండ్రి మాటల్లోని ఆర్ద్రతకు అతడి హృదయం ద్రవించిపోయింది. అందరూ తనను తెగ

మెచ్చుకోవటంలేదేమి ... మిగతా అంతా ఊరకున్నారేం ?

"ఔను. నాకూ ఇష్టంలేదు. కాని ఏం చెయ్యలేని స్థితిలో ఉన్నాము. ఆ మందుల కంపెనీ వాళ్ళిచ్చే జీతాన్ని, మన స్థితిగతులను చూచి బోలెడు కట్నం ఇస్తామని మరొకరు రారు."

"అన్నయ్య అందాన్ని చూచి రావచ్చుగా ?" టీనేజర్ అనిపించుకుంది సుమలత.

అంతా నవ్వారు "అదంతా కలల్లో,పుస్తకాల్లో, సినిమాల్లో. నిజ జీవితంలో అందమైన డబ్బున్న అమ్మాయికి, డబ్బున్న అందమైన అబ్బాయి కావాలి" తండ్రి అన్నాడు.

"త్యాగం— త్యాగం— అంటున్నారు. బోలెడు డబ్బు. అనుభవించేది తాంబైశాతం అన్నయ్యేగా?" సుమలత మళ్ళీ చిన్న పిల్లలా ప్రశ్నించింది.

"ఇప్పుడు ఇవన్నీ నీ కెందుకమ్మా. ఇకపై ఈ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, ఆనందంగా హృదయం నిండుగా నవ్వినా దానివెనుక అన్నయ్య ఉన్నాడని జ్ఞాపకం పెట్టుకోవాలి."

మాధవ్ చటుక్కున లేచి అప్పుడే వచ్చినట్లు నటించాడు. తను "ఒద్దు— నాకీ పెళ్ళి ఇష్టం లేదు" అని గట్టిగా చెప్పాలనుకున్నాడు. కాని తను బంధితుడు... ఈ అనుబంధాలన్నీ తనను బంధించి వేశాయి. ఒక్క అడుగు తానుగా తాను వేయలేదు.

"అమ్మా" అని కేకేస్తూ మంచం మీద కూర్చున్నాడు.

"ఆ... వస్తున్నా" అందామె. అంతా ఇవతలికొచ్చారు.

కాసేపటికి తల్లి కాఫీ తెచ్చింది.

"ఒద్దమ్మా...రాజా, నేను తీసుకున్నాం."

"కాఫీయేగా. ఫరవాలేదు తీసుకో." తల్లి ముఖంలోకి చూచి మెల్లగా గ్లాస్ అందుకున్నాడు. అతడి కళ్ళు ఒక్కక్షణం ఆమె మెడలో జిడ్డోడుతున్న పసుపుతాడుపై బడింది. దాని రంగు పసుపు అని ఎవ్వరూ అనరు.

కాఫీ రెండుసార్లు వెచ్చబెట్టినందుకు ఏమీ బాగులేదు. ఒకప్పుడు అదే అమృతంలా ఉండేది. మాట్లాడకుండా త్రాగుతున్నాడు. ఇంతలో తల్లి ఒక కవరు తెచ్చి అందించింది. అడ్రస్ టైప్‌చేసి వుంది. పెద్ద తెల్ల కవరు. చూడగానే ఏదో

# తొణకని స్వప్నం

ఆఫీషియల్‌లా ఉంది. ఎవరికి వారు వారివారి పనుల మీద వెళ్ళిపోయారు. మాధవ్ ఆ ఉత్తరాన్ని తీశాడు. టైప్ చేసిన ఉత్తరం అది. క్రింద చూచాడు. సంతకంగాని, పేరుగాని లేదు. కాని అడ్రస్ చూడగానే అది ఎక్కడినుండి వచ్చిందో అర్థమైంది. కొంచెం ఎగ్జైట్ అయ్యాడు కూడా. తండ్రి రావటం చూచి ఉత్తరాన్ని కవర్లో పెట్టేశాడు.

"నీ కాబోయే మామగారు ఈ వారంలో వచ్చి కొంత డబ్బు తీసుకెళ్ళమని కబురు పంపారు మాధవ్. ఎప్పుడు వెళ్దాం ?"

"ఆదివారం" అన్నాడు పొడిపొడిగా. ఐదు రోజులుంది ఇంకా — ఆదివారం. సరే—అని ఆయన వెళ్ళిపోయాడు.

మాధవ్ ఉత్తరం బైటికి తీశాడు.

రోజ్ విల్లా.

మాధవ్‌గార్కి,


మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి. మీకు వీలైనప్పుడు బేసిసంఖ్య తేదీలలో ఏరోజైనా సాయంత్రం ఆరుగంటల తరువాత రావలసినదిగా కోరుతున్నాను.

ఇట్లు
మీ శ్రేయోభిలాషి.

ఆ శ్రేయోభిలాషి ఎవరో వెంటనే తెలిసిపోయింది. ఆమె — అమల — తనకు కాబోయే భార్య.

ఎక్కడ కలుసుకోవాలి ? ఏమీ రాయలేదే ... అని కాసేపు అటు ఇటు చూచాడు. ఏదైన సంకేత స్థలం ఉన్నదేమోనని. లేదు ... అంటే ఇంటికే వెళ్ళాలన్నమాట...ఏం మాట్లాడుతుంది ? మొదట అతడి హృదయం ఎదురు తిరిగింది. వెళ్ళకూడదనుకున్నాడు. కాని ఎందువల్లనో శ్రేయోభిలాషి అని చేత్తో రాసిన ఆ అక్షరాలు అతణ్ణి కదిలించి వేశాయి.

ఆ రోజు పదకొండు — వెళ్తే ఏం ? ముఖం కడుక్కుని గుడ్డలు మార్చుకుని బయలుదేరాడు. కాబోయే భార్యను కలుసుకోబోతున్న ఆనందం — ఆత్రానికన్నా "ఎందుకు పిల్చింది ?" "ఏం



1982 సంవత్సరానికి "ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్"వారి యువశాస్త్రవేత్త అవార్డు ప్రదానానికి ఎంపిక చేయబడిన డా. ఎ. ఎస్. బుద్ధుడు వీరికి ఈ అవార్డు భౌతికశాస్త్రంలో లభించింది. డా. బుద్ధుడు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్రం శాఖలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

మాట్లాడాలి ?" అన్న ఉత్సుకత అధికంగా ఉంది.


గేట్ దగ్గర ఆటో ఆపి లోపలికెళ్ళాడు.


నౌకరు వెంటనే అతణ్ణి సాదరంగా లోపలికి తీసుకెళ్ళాడు. అమలకు చెప్పటానికి లోపలికి వెళ్ళాడు ఆమల గబగబ వచ్చింది.

ఆతడు అమలను చూచి చటుక్కున లేచి నుంచున్నాడు. అమల నమస్కరించింది. "రండి... నా గదిలోకి వెళ్దాం" ఈమె ఎటువంటి వ్యక్తి ? పరపురుషుడిని తన గదిలోకి తీసుకుని వెళ్తోంది !

వెనకాతల నుండి చూస్తే ఆమె అందంగానే ఉంది. ఒంపు సొంపులన్నీ ఉండవలసిన తీరులో ఉన్నాయి.

ఐదారు గదులు దాటివెళ్ళిన తరువాత ఒక విశాలమైన గదిలో ప్రవేశించారు. ఒత్తుగా మెత్తగా ఉన్న సింగిల్ సోఫాను చూపిస్తూ "కూర్చోండి" అంది. అతడు కూర్చున్న వెంటనే ఆమె వెళ్ళిపోయింది. మాధవ్ ఆశ్చర్యంతో ఆ గదిని పరిశీలనగా






## డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### ఎఫ్. బి. — ఆకివీడు

నా వయస్సు 17 సంవత్సరములు. నా శరీరము బరువు తగ్గుటకు, నాజూకుగా వుండుటకు నేను అవలంబించవలసిన పద్ధతులు ఏవి ? మూడు నెలల నుండి సాయంత్రం చపాతీలు తినుచున్నాను. అయినా శరీరం బరువు తగ్గలేదు.

★ క్రమ పద్ధతిలో శరీర వ్యాయామం చేయటం, ఆహారం నియమబద్ధంగా కావలసినంత మేరకు మాత్రమే తీసుకోవటం వల్ల శరీరం నాజూకుగా ఉంటుంది. చపాతీలు తిన్నందువల్ల మాత్రం శరీరం నాజూకు రాదు. మితమైన ఆహారం ఏదైనా ఒకటే.

### కె వి.ఎస్.ఎస్.ఎం — యలమంచిలి

సెక్స్ వాంఛను అరికట్టే మందులు తెలియ పర్చండి ?

★ సెక్స్ వాంఛను అరికట్టడానికి ప్రత్యేకంగా మందులేవీ లేవు. ఆత్మబలమే ప్రధానం. శస్త్ర చికిత్స ద్వారా టెస్టిస్‌లను, ఓవరీలను తొలగిస్తే కొంతవరకూ ఈ వాంఛ తగ్గుతుంది.

### జి. వి. ఆర్. — పాలకొల్లు

పెళ్ళి అయిన వెంటనే తండ్రి కావటం ఇష్టం లేదు. కొన్నాళ్ళు కుటుంబనియంత్రణ పాటిద్దామను కొంటున్నాను. అలా చేయాలంటే ఏ మాత్రలు వేసుకోవాలి, ఎలా వేసుకోవాలి ?

★ కుటుంబనియంత్రణకుగాను పురుషులు వాడటానికి మాత్రలు ఏవీ లేవు. పురుషులు వాడ తగింది ఒక్క నిరోధ్ మాత్రమే !

### ఎం. ఎన్. — కడప

నా వయస్సు 16 సం॥లు. నాకు ఎక్కువగా మెడనెప్పి వస్తుంది. కాసేపు కూర్చొన్నా, బస్సులో, రైల్లో ప్రయాణించినా ఈ నెప్పి వస్తోంది. నా తలక్రింద, అంటే ఎడమ చెవి పక్కన ఒక ఎముక ఉన్నది. అది చిన్నప్పటికంటే కాస్త పెద్దదయింది.

★ ఆ ఎముక "సెర్వైకల్ రిబ్" అయి ఉంటే, శస్త్రచికిత్స ద్వారా తీసివేసే అవకాశం ఉన్నది. అలాకాక వేరే ఎముక ఏదైనా పెరిగి ఉంటే దాని గురించి వైద్యులు ప్రత్యక్షంగా పరీక్షించిగాని ఏ నిర్ణయమూ తీసుకోలేరు.

### టి. ఎస్. కె. - కదిరి

నా వయస్సు 13 సం॥లు. నా ముక్కులో రక్తం చాలా కాలం నుంచి పడుచున్నది. డాక్టర్‌కి చూపించి ఎన్ని మందులు వాడినా తగ్గటంలేదు.

★ మీరు నిపుణులైన ఇ. ఎన్. టి. వైద్యులకి చూపించండి. మ్యూకస్ మెంబ్రేన్‌లో రక్తనాళాలు గుబురుగా చేరి ఉండటంవల్ల కొన్ని సందర్భాలలో ఇలా జరిగే అవకాశం ఉంటుంది. కాటరైజేషన్ చేయటం ద్వారా నివారణ కలిగే అవకాశం ఉంటుంది

### పి. ఎస్. — కరీంనగర్

మా అక్క రోజా కనీసం 30 సార్లయినా అద్దం ముందు నిలబడి ముఖం చూసుకొంటూ, రెండు వేళ్ళతో వెంట్రుకలను లాగుతుంది. ఇది ఒక రోగమేనా ?

★ రోగమని చెప్పటానికి ఆస్కారం లేదు ఇది ఒక విధమైన మానసిక బలహీనత. ఇటువంటి లక్షణం నిరంతరం ఏదో వ్యాపకం పెట్టుకోవటం వల్ల తగ్గిపోతుంది. దీనికి మందులు అనవసరం.

### ఆర్. యు. పి. ఐ. — పెదనింద్రకొలను

నాకు కొంతకాలం నుండి నిద్రలో వీర్యం పోవుచున్నది. అలా పోకుండా ఉండటానికి ఏ మందులు వాడాలో తెలియజేయండి ?

★ యుక్తవయస్కులకి నిద్రలో వీర్యం పోవటం ఏమంత హానికరమైన విషయం కాదు రోగం కానేకాదు. ఒక విధంగా సహజమేనని చెప్ప వలసి ఉంది.

సెక్స్ ఆలోచనలు మానటం, కామోద్రేకాన్ని కలిగించే పుస్తకాలను చదవకపోవటం, సినిమాలు మొదలయినవి చూడకపోవటం వల్ల కొంతవరకు ఈ లక్షణాన్ని తగ్గించవచ్చును. ★

---

చూచాడు. ఆ గదికి ఒక వైపంతా పెద్దపెద్ద గాజు కిటికీలున్నాయి. ఆ కిటికీల్లోంచి గులాబితోట అందమంతా కానవస్తుంది. ఒక వైపు రాక్స్ నిండా పుస్తకాలు అమర్చి ఉన్నాయి. మరొక వైపు చూడగానే అతడి దృష్టి అక్కడే నిల్చిపోయింది. దీవాన్ మీద గిటార్ ఉంది. దాని ప్రక్కన పెద్ద చెక్క ఫ్రేమ్ ఉంది. ఆ ఫ్రేమ్‌కు కట్టిన త్రాళ్ళు,క్రింద ఉన్న ఊలు ఉండలు, ఇతర సరంజామా చూడగానే అదొక తివాచి అని తేల్చుకున్నాడు దగ్గరగా వెళ్ళి చూచాడు. నాలుగు బై ఐదు అడుగులున్న ఆ తివాచి ఒక్క అడుగు మాత్రం చేసి ఉంది. ఆమె మంచం ఆ గదిలో లేదు "లైట్ వేసుకోండి" అమల అనటంతో అతడు వెనక్కి తిరిగి చూడలేదు. తివాచి ఫ్రేమ్ ప్రక్కగా ఉన్న స్విచ్ నొక్కాడు. చూరు నుండి వ్రేలాడుతున్న లైట్లు వెలిగాయి.

"నా హాబీ" అందామె. "ఆ ప్రక్క గ్రాఫ్ పేపర్‌లో ఉన్న డిజైన్ దీని మీదికి రావాలి."

మాధవ్ ఆ డిజైన్ చూచాడు. అది ట్రెడిషనల్ డిజైన్. లతలు, పూవులు, మొగ్గలు ఉన్న డిజైన్ అది.

అతడు దాన్ని చూస్తూ అక్కడే ఉండి పోతాడేమో అని — "రండి...తీసుకోండి" అంది.

మాధవ్ వెనక్కి తిరిగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. పనిపిల్ల ట్రే అక్కడపెట్టి వెళ్ళి పోయింది.

చల్లటి పళ్ళరసం — వేయించిన జీడిపప్పు అతడికి దగ్గరగా ఉన్న టీపాయ్‌మీద తనే పెట్టింది. తనొక గ్లాస్ తీసుకుంది.

"ఈ రోజు మీరు వస్తారనుకోలేదు ...... భోజనానికి ఉంటారా ?"

"అమ్మ ఎదురుచూస్తూ వుంటుంది. వద్దు" అన్నాడు.

అమల మాట్లాడలేదు. అతడు సంభాషణ ప్రారంభించాలని ఎదురుచూస్తోంది. కాని మాధవ్ ఆ ప్రయత్నం చేయలేదు.

"నా ఉత్తరం అందిందనుకుంటాను ?"

"రాగానే అమ్మ ఇచ్చింది. ఎందుకు రమ్మని రాశారు ?"

"నిన్న మీ నాన్నగారొచ్చి చెప్పారు. ఈ పెళ్ళి మీకు అంగీకారమే అని... నిజంగా మీరు అంగీకరించారా ?" ఆమె అతడికేసి సీరియస్‌గా చూసింది

మాధవ్‌కు ఇబ్బందిగా వుంది. ఒక జీడిపప్పు నోట్లో వేసుకున్నాడు. తనకు సమయం కావాలి... ఎంత చక్కగా అడుగుతోంది! మీరు అంగీకరించారా? అని—

"చెప్పండి—మీ కిష్టమేనా ?"

"లేదు" అని కసిదీరా అరవాలనిపించింది. కాని ఎందువల్లనో ఆమె సమక్షంలో అతడు ఎంతో బలహీనుడైపోతున్నాడు. ఒక్క క్షణం ఆమెకేసి చూచాడు. చీర మామూలు వాయిల్ చీర. ముఖం క్రిందనుండి ఆమె ఎంతో బావుంది— ఆ ముఖం... గ్లాసులోవున్న పానీయంకేసి చూచి ఒక సిప్ తీసుకున్నాడు. తన అందమైన విగ్రహం తన కళ్ళెదుట నిల్చింది. తనను చూస్తోంటే ఆమెకు ఎలావుందో! పిచ్చి ఎక్కటంలేదూ ? తన మీదబడి నేనెంత అదృష్టవంతురాల్ని అని కౌగలించుకుంటే.. తను ఛీ.. అని దూరంగా వెళ్ళిపోవాలి ..

(ఇంకా ఉంది)

పెద్ద కథ

# తొణకని స్వప్నం

## కోమలాదేవి

"మీ హృదయంలోని అలజడిని గుర్తించ గలను. మీతో ఎన్నో విషయాలు మాట్లాడాలని రమ్మన్నాను. దయచేసి చెప్పండి" ఆమె వేడికోలుగ అంది. అతడికి చీకాకువేసింది.

"అమలగారూ — ముందు ఈ విషయం చెప్పండి. మీకు అంగీకారమేనా ?" అతడి కంఠంలో వ్యంగ్యం ధ్వనించింది.

ఆ మాట అనగానే ఆమె అందవిహీనమైన మోము కూడ ఆనందంతో విప్పారుతుందని — కళ్ళు సిగ్గుతో వాలిపోతాయని ఛాతీవిరిచి కూర్చున్నాడు. ఆ ఛాతీ విరుపులో అతడి అహం పొంగినట్లుగా ఉంది.

ఆమె సిప్ తీసుకుని గ్లాస్ ప్రక్కన బెట్టింది.

అతడి దెస నిశ్చలంగా చూస్తూ అంది "నాకు ఇష్టం లేదు" ఆ మాటలు శరాఘాతాలైనై. మాధవ్ గూడలు చటుక్కున ఒంగిపోయాయి ఎత్తయిన స్థలంలో కూర్చున్న తనను ఒక్క దెబ్బతో క్రింద పడద్రోసి తన శరీరాన్ని తుత్తునియలుగా జేసినంతగా బాధపడ్డాడు ఆ తరువాత అతడిలో కోపం రగులుకున్నది. ఈమె... ఈ కురూపి.. తనను ఇష్టపడటంలేదు ! ఎంత అహంకారం ! డబ్బులో మునిగితేలే ఈమెకు అందం సంగతి ఏం తెలుసును... అతడిలో మాటుమణిగి ఉన్న పైశాచిక ప్రవృత్తి తల ఎత్తింది. వికటంగా నవ్వాడు. చటుక్కున లేచి నుంచుని — రెండు చేతులు పరచి నట్లు చాపి. .

"అమలా — చూడండి... నేను మీకు నచ్చలేదా?" వికటాట్టహాసం చేస్తున్నట్లు అడిగాడు.

ఆమె తల ఎత్తి అతణ్ణి నఖశిఖ పర్యంతం చూడలేదు.

తల వంచుకుని మెల్లగా అంది "మీరు నచ్చటం — నచ్చకపోవటం ప్రశ్న కాదు. ఈ విధమైన సంబంధం నచ్చలేదు."

అతడు చకితుడయ్యాడు ఆమె వంచిన తల ఎత్తలేదు. తన సుందర రూపాన్ని తనివితీర అవలోకించటంలేదు. "మీలాంటివారు నాకు భర్తగా లభిస్తుంటే — నేనెంత అదృష్టవంతురాలినండీ —" అన్న డైలాగుల కోసం ఎదురుచూచిన మాధవ్ శరీరంలోని శక్తి అంతా ఆవిరిలా తేలిపోయింది. అతడు నిస్సత్తువతో కుర్చీలో కూలబడి రెండు చేతుల్లో తల పట్టుకున్నాడు.

(గత సంచిక తరువాయి)

"సారి... మీకు బాధ కల్గించాను... ఈ నీళ్ళు త్రాగండి" ఆమె గ్లాస్‌లో నీళ్ళుపోసి అందించింది

మాధవ్ అందుకుని త్రాగాడు. ఆమె కుర్చీ కాస్త దగ్గరగా వేసుకుని అంది "మిమ్మల్ని అవమానించాలని ఇక్కడికి పిలిపించలేదు. మీ అందాన్ని కించపర్చటంలేదు. అసూయతో అనటంలేదు. మీ అంత అందమైనవారు నాలాంటిదాన్ని పెళ్ళి చేసుకోటానికి అంగీకరించారంటే మీనుండి మీవాళ్ళంతా గొప్ప త్యాగం కోరారు. ఈ త్యాగాన్ని మీరు మనస్ఫూర్తిగా చేస్తున్నానని అనుకుంటు న్నారు. కాని ఇందులో మూడవ వ్యక్తిగా నేనున్నానన్న విషయం ఎవ్వరికీ పట్టలేదు. ముఖ్యంగా మీకు"

"నాకు పట్టలేదా ? తాళి కట్టేది నేను.." అన్నాడు ఎకసెక్కెంగా.

"ఔను కట్టిన తరువాత ?"

అతడు ఒక్కసారి ఆమె దెస చూచి తల త్రిప్పేసుకున్నాడు.

"ఔను. కట్టినతరువాత నన్ను మీ భార్యగా చూచుకోగలరా ? ఆ ధైర్యం మీకున్నదా ?"

అతడు మౌనమే శరణన్నట్లు కూర్చున్నాడు.

"ఆ రాక్‌లలో పుస్తకాలన్నీ చూచారా ? మీకు టైంలేదు. ఒక్కసారి చూడండి. అన్నీ హైయ్యర్ మేథమేటిక్స్‌కు సంబంధించిన పుస్తకాలే. అవన్నీ నా పుస్తకాలు. నేను ఎం.ఎస్సీ. ప్యూర్ మేథ్స్‌తో పాసయ్యానని మీకు తెలుసు. ఫస్ట్ వచ్చాను. గోల్డ్ మెడల్‌కూడ మీరు చూచారు... కాబట్టి నా ఆలోచనలు ఒక్కఅంశంమీద కేంద్రీకృతమై ఆగిపోవు. ఒక లెక్క ఉంది — ఒక చిన్న ఈక్వేషన్ ఉంది. ఇ = ఎమ్‌సి$^{2}$ అన్నంత చిన్న ఈక్వేషన్‌లో ఎంత క్లిష్టమైన గణితం ఉంది ! దాన్ని విశదీకరించాలంటే ఎన్ని పేజీలు నింపాలి ! ఈ జీవితాన్ని కూడ అదే దృష్టితో చూస్తాను. మీరన్నట్లు తాళి కట్టటం అనేది ఒక చిన్న చర్య. రిజిస్ట్రార్ ఆఫీసులో కట్టినా, లక్షలు ఖర్చుచేసి ఐదురోజుల పెళ్ళిలో తాళికట్టినా ఒకటే. కాని జీవితంలో ఆ చిన్ని మలుపు తీసుకుని ఆగిపోవటం ఘోరం. ఆ క్షణం తరువాత ఎలా గడుస్తుంది. లెక్కను పెంచి, ఎన్నో సూత్రాలను ఉపయోగించి ఆన్సర్ తెచ్చి చూపటం లాంటిదే వైవాహిక జీవితం కూడా. అందుకే అడుగుతున్నాను. మీ భార్య గా నాకు మీ జీవితంలో చోటిచ్చి గౌరవించగలరా ?"

మాధవ్ తల ఎత్తలేదు. ఆమెకేసి చూడలేదు కాని ఒక్క నిట్టూర్పు వదిలాడు.

"చూచారా ... మీ కుటుంబంలోని ఐదుగురు సభ్యుల ఆనందం కోసం మీరు త్యాగం చేస్తున్నట్లు ఫీలవుతున్నారు. కాని మరొక వ్యక్తిని అధఃపాతాళంలోకి త్రోసివేస్తున్న విషయం మర్చిపోయారు. పెళ్ళైన తరువాత నన్ను నా పాటికి వదిలేస్తారు. డబ్బు ఉంటే ఎన్నో సుఖాల్ని కొనితెచ్చుకోవచ్చు. పేరుకు భార్యగా ఉండటానికి నా వ్యక్తిత్వం ఒప్పుకోదు."

"ఐతే నాకీ పెళ్ళి ఒద్దు అని చెప్పేయండి" అన్నాడు ఆశగా.

"నేను ఆడదాన్ని. అమ్మా నాన్నలు నా పెళ్ళి చేసితీరాలి. అదివారి కర్తవ్యం. ఈ ఇంటి అల్లుడికి ఉండవలసిన అర్హతలు రెండు ఒకటి సుమారైన ఉద్యోగంలో ఉండాలి. గౌరవంగా బ్రతుకుతున్న కుటుంబానికి చెందినవాడుగ ఉండాలి. ఎవరైన 'ఏం చూసి పిల్లను వాళ్ళకిచ్చారండీ ?' అని అడిగితే వాళ్ళది మంచి సంప్రదాయంగల కుటుంబం— అని—లేక అబ్బాయిది మంచి ఉద్యోగం అని చెప్పకోవచ్చు. మీ విషయంలో ఇంకా గొప్ప కారణమే చెప్పకోవచ్చు."

"ఐతే నేను నా అనంగీకారాన్ని తెల్పాలంటారు ఔనా ?"

"ఔను" అంది దృఢంగా.

మాధవ్ కంఠం తడారిపోయింది. ఈమె తనను ఒద్దు అనమంటుంది కాని అది సాధ్యమా? పిల్లిచ్చే డబ్బుతో అప్పులుతీరి, ఇల్లు బాగై, కుసుమ పెళ్ళై కేశవ్ చదువు నిరాటంకంగా సాగి ఆ తరువాత ఎన్నోసుఖాల్నిఅనుభవించాలనుకుంటున్నారు. ఆ మధ్య తల్లీ తండ్రి తనను కూర్చోబెట్టుకుని హృదయం ద్రవించిపోయేలా దుఃఖిస్తూ తమకు విముక్తి కల్గించమని కోరారు. ఈ సంబంధం ఖాయం అయితే సమస్యలు లేవన్నారు. అందంగా ఉండదు... కాని అందాన్ని కొరుక్కుతింటామా ? తండ్రి ఇంకా రెండు నెలల్లో రిటైర్ అవుతాడు. ఆయన హైస్కూల్లో మేష్టారుగా పనిచేస్తున్నారు. ఆ తరువాత వాళ్ళ గతి ? తను తనకువచ్చే వెయ్యి రూపాయలలో ఈ సంసార బాధ్యతను స్వీకరించి బాధ్యతల్ని నెరవేర్చగలడా ? అది తలంచుకొంటేనే భయంగా ఉంటుంది—

ఆమె జాలిపడింది. "పాపం— మీరు కూడా నాలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్నారు... మీరు ఇట్లా ఉన్నారని నేను భయపడి ఒద్దు అనమంటున్నాను— నేను ఇట్లా ఉన్నానని మీరు భయపడినా కావాలనుకుంటున్నారు. రెండూ విరుద్ధం— కాని దాని ఫలితం ఒక్కటే... పెళ్ళి..."

మాధవ్ తల ఎత్తలేదు. ఆమెకు బాధగా వుంది. వెళ్ళి లైట్లన్నీ ఆర్పివేసి ఒక్క డిమ్ లైట్ మాత్రం వేసింది. "నన్ను చూడటానికి వెల్తురు పనికిరాదు. చీకటిలో మాట్లాడుకోవటం బావుంటుంది."

మాధవ్ సోఫాలో ఆనుకుని ఆమెను చూచాడు. మసకగా ఆకారం కనిపిస్తోంది. అదేబావున్నట్లుంది.

"మీ నాన్నగారు ఎంత డబ్బు తీసుకోబోతున్నారో మీకు తెలుసా ?"

మాధవ్ నిర్ఘాంతపోయాడు. తెలీదని చెప్ప టానికి సిగ్గువేసింది.

"చూచారా ? ఈ వ్యవహారంలో మీరు ప్రముఖ పాత్ర వహించవలసినది బోయి ఏదీ తెలుసుకోటానికి కూడా ఇష్టపడని మీ అంతర్యంలో ఏమున్నదో గ్రాహ్యమవుతున్నది. నేను 'ఊ' అనాలి. నా ప్రమేయం అంతవరకే అనుకున్నారు. ఈ ముఖ్య విషయాల్ని నాన్నలకు ఒదిలేశారు."

ఆమె నిట్మూర్పు అతడి చేతకాని తనానికి బాధపడుతున్నట్లలా ఉంది.

"చెప్పండి. పెళ్ళయ్యాక ఎక్కడ ఉండాలి ?"

"ఎక్కడో ఎందుకు ? మా ఇంట్లో..." ధీమాగా అన్నాడు.

"ఔను ... ఉదయం మీ నాన్నగారొచ్చారు. మా నాన్నగారు వేరే ఇల్లు చూచి కూతుర్ని అల్లుణ్ణి ఉంచాలన్నారు. కాని మీ నాన్నగారు ఇష్టపడలేదు. తమ ఇల్లు చాలా పెద్దదని— కాని బాగా పాతబడి పోయిందని రిపేర్ చేయించి — రెండు గదులు కట్టిస్తే కొడుకు కోడలు తమ దగ్గరే ఉంటారని— అంతా కలసి ఉంటే తనకు సంతోషంగా ఉంటుం దన్నారు. మీ అమ్మాయికి వీలుగా ఉండేట్లు కట్టిస్తాను అన్నారు. మరో మాట కూడ అన్నారు— 'మా అబ్బాయికి కోడలితో మా ఇంట్లో ఉండటమే ఇష్టం' అన్నారు."

"ఔను" అన్నాడు మాధవ్ ముక్తసరిగా.

"కాని నాకిష్టం లేదు" అంది అమల దృఢంగా.

"ఎందుకు ? మా అమ్మా— అంతా చాలా మంచి వాళ్ళు ........."

"వాళ్ళు మంచి వాళ్ళు కాదని నేననటం లేదు. ముందే చెప్పాను. ఒక అంశాన్ని గూర్చి ఎన్నో కోణాల్లో ఆలోచించటం నా అలవాటు. మీ మాటలను బట్టి ఒక విషయం తేలిపోయింది, నాపై వ్యక్తిగతంగా ఎటువంటి సద్భావం లేదని. ఆ గృహంలో నా స్థానం ఏమిటి? గుమ్మం కదిలి బైటకెళ్ళటానికి వీలుండదు— నాతో ఎవ్వరు రారు — ఎంత మంచివాళ్ళయినా చిన్న మాటతో నన్ను గూర్చి హేళన చేయవచ్చు. కొడుకు భార్యగా, అన్న భార్యగా గుర్తింపు ఉండదు. "పడిఉండు" అంటే పడి ఉండగల స్వభావం కాదు నాది. అట్లా అని స్వేచ్ఛగా నా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే అహంకారం నాలో లేదు. ఈ ఇంట్లో అమ్మ నాన్న నాకు విశిష్టస్థానం ఇచ్చారు. ఇద్దరన్నయ్యలను, ఒక అక్కయ్యను పెంచినంత నార్మల్‌గా నన్ను పెంచారు. పదిమందిలో తిరగవలసి వచ్చినప్పుడు నన్ను కూడ తీసుకుని వెళ్ళేవారు. డబ్బు మహత్మ్యం కాబోలు నా ఎదుట నన్ను ఎవరు ఏమి అనే వారు కారు. అద్దంలో నన్ను నేను చూసుకుని ఇలా ఉన్నానెందుకని ఒకసారి అమ్మ నడిగాను. ఆమె అతి మామూలుగ నవ్వి నన్ను దగ్గరకు తీసుకున్నది. కారాకిళ్ళీ వేసుకుని బుగ్గన పెట్టుకుని గ్రహణం పట్టిన రోజున పడుకున్నదట. అందుకే నా బుగ్గమీద ఈ నల్లటి అసహ్యకరమైన మచ్చ వచ్చిందట ! అదంతా ఉట్టిదే అని తరువాత తెలుసుకున్నాననుకోండి. నాలో నిబిడీకృతమైన శక్తుల్ని అతి చాకచక్యంతో గ్రహించి బైటకి తెచ్చి అందులో ప్రావీణ్యం సంపాదించేలా చేశారు. నన్ను ఒక పరిధిలో ఉంచి బంధించలేదు. 'నీకెందుకులేమ్మా' 'ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు' 'నీకు బావుండదు' 'నీవు రావద్దు' 'అక్కడికి నీవు వెళ్ళ కూడదు' 'నిన్ను చూచి నవ్వుతారేమొ' ఇటువంటి ఆంక్షలు విధించి నాలో సంకోచబీజాన్ని నాటి నాపై



తెలుగువారి
పేరెన్నికగన్న
పచ్చళ్ళు
ఆహా!! భలే రుచి

బిందు
పచ్చళ్ళు




nvkr • kripu

మీరు కోరే పలురకాల్లో
మామిడికాయ, నిమ్మకాయ,
అల్లం, గోంగూర, పండుమిరప,
టొమేటో, ఉసిరికాయ

FOR DEALERSHIP &
BULK SUPPLIES
PLEASE CONTACT

BINDU COTTAGE
INDUSTRIES,
21.7-18, HANUMAN TEMPLE STR.
MUTYALAMPADU,
VIJAYAWADA.520 011

## తొణకని స్వప్నం

నాకు జాలి కల్గేలా చేయలేదు. 'అట్లా చెయ్యాలి' అట్లా ముందంజ వేయాలి అని ప్రోత్సహించారు. నా మానసిక ఎదుగుదల అతి ఆరోగ్యకరంగా ఉన్నది. నన్ను గూర్చి నేను ఆలోచించుకోటానికి వ్యవధి లేకుండా చేశారు. చదువు, ఆ తరువాత సంగీతం — ఆ తరువాత గిటారు వాయించటంలో అలసిపోయే దాన్ని. అట్లా అని నాలో బాధ, అశాంతి, మానసికంగా కృంగిపోవటం వంటివి లేకపోలేదు. నేను అతి మామూలు స్త్రీని. ఒక్కో సంవత్సరం గడిచేకొలది నా పరిస్థితిని అర్థం చేసుకుని తగురీతి ఆలోచించగల మానసిక ప్రవృత్తిని అలవర్చుకున్నాను. వికలాంగుల కన్నా అదృష్టవంతురాల్ని. భగవంతుడు నన్ను ఈ అమ్మా నాన్నల చేతిలో పెట్టాడు. ఇప్పుడు చెప్పండి నన్ను తీసుకుని వెళ్ళి మీ ఇంట్లో పెట్టేసి అంతటితో మీ బాధ్యత తీరిపోయినట్లు వ్యవహరిస్తే నేను భరించగలనా ?''

మాధవ్ మాట్లాడలేదు.

అమల అతి మెల్లగా అడిగింది ''అసలు మీరు వింటున్నారా ?''

''వింటున్నాను. మీరు చాలా దూరం ఆలోచిస్తున్నారు.''

''ఔను. మీరు ఆలోచించలేదు. తాళికట్టటం తరువాత ఫుల్‌స్టాప్ పెట్టారు— ఆ తరువాత నన్ను మీ ఇంటికి తీసుకువెళ్ళాక ఫుల్‌స్టాప్ పెట్టారు. అంటే ఆ తరువాత నా విషయంలో బాధ్యత తీసుకోవటంగాని, జోక్యం కల్గించుకోటంగాని, ఏదీ చేయరన్నమాట !''

''మీరు పొరబడుతున్నారు. ఉమ్మడి కుటుంబంలో అమ్మా, నాన్నల ఇష్టానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వారి మాట వినాలి. నేను వారికి విధేయుడనై ఉండాలి. నా బాధ్యత వారిదే కనుక మీ బాధ్యత వారు స్వీకరిస్తారు.''

''ఔను. సాధారణ కుటుంబాలలో ఇలాగే జరుగుతుంది. మా అక్కయ్య బాధ్యత అంతా వాళ్ళ అత్తమామగార్లదే. వాళ్ళకు అక్క అంటే ఎంతో ఇష్టం. ప్రేమతో చూచుకుంటారు. అట్లా అని మా బావ అక్కయ్య పూచీ తనది కానట్లుండరే ! ఆమె తన స్వంతం అనుకోవటమే కాకుండా — ఆమె సలహాలు తీసుకుంటారు. వాళ్ళకు కూడ ఎన్నో సమస్యలుంటాయి.''

ఆమె మాట్లాడే తీరు అతడి ఆలోచనలకు పదును పెట్టింది. ఎంత సున్నితంగా చెబుతోంది ! తనకు తెలుసు... వాళ్ళ బావగారు వాళ్ళకు చాల పెద్ద ఆటో వర్క్‌షాప్ ఉన్నదని. కొన్ని స్పేర్‌పార్ట్‌లను విదేశాలనుండి దిగుమతి చేసుకోటానికి లైసెన్స్ ఉంది. వీళ్ళకు వాళ్ళు సరితూగ గలరు. అటువంటి ఇంట్లో ఆ విధమైనట్లు అత్త, మామ, భర్త, కోడలు పట్ల ప్రవర్తిస్తుంటే — ఎందులోను పోల్చుకోటానికి కూడ ఒక్క విషయంలేని మీ ఇంట్లో నన్ను వాళ్ళమధ్య ఒంటరిగా వదిలేసి మీరు దూరంగా బాధ్యత తీరిపోయినట్లు ఉంటారా ? అని అడుగుతోంది — నిజమే ...'తను అలాగే అనుకున్నాడు. పెళ్ళైయ్యాక ఆమెను తెచ్చి ఇంట్లో పడేస్తాడు. పడి ఉంటుంది. అమ్మా నాన్న డబ్బు వ్యవహారాలు చూచుకుంటారు. తనవాళ్ళంతా పైకి వస్తారు, సుఖిస్తారు. తను ఆమె నుండి దూరంగా అతి దూరంగా ఉండిపోతాడు. అది తన తప్పుకాదు. కురూపిగా ఉండి తనను పెళ్ళాడిన ఆమెది—డబ్బిచ్చి తనను కొన్న మామగారిది — అని కసిగా అనుకునే వాడు ... కాని ... ఈమె ...అందరిలాంటిదికాదు..

ఆమె సునిశిత పరిశీలన — సంస్కారవంతమైన మాటలు — దాపరికం లేకుండ సూటిగ ప్రశ్నించే తీరు ... ముఖ్యంగా తన ఆలోచనల్ని పసిగట్టి ఒక్కో విషయాన్ని బైటికి లాగుతున్న చాకచక్యం అతడిలోని జడత్వాన్ని, దూరంగా పారిపోవాలన్న కాంక్షను పారద్రోలాయి.

''సారి ... నేను ఆలోచించలేదు'' నేరస్థుడిలా అన్నాడు.

''ఫరవాలేదు. ఒప్పుకున్నారు ... మరి అట్లా అయితే దయచేసి ఆలోచించండి. ఇంతకాలం మీరు ఒక కోణంలో ఆలోచించారు. మిమ్మల్ని కేంద్రంగా పెట్టుకున్నారు. 'ఈ పెళ్ళివల్ల ప్రతి ఒక్కరు లాభం పొందుతారు, నేను తప్ప. నా భవిష్యత్తు, నా ఆనందం — నా బంగారు కలలు అన్నీ అగ్నిపాలైపోయాయి. నా వెలుగులో అందరు ఆనందంగా ఉండాలి — నేను కరిగి నశించిపోయినా ఫరవాలేదు' అన్న ఆలోచనతో ఉన్నారు. కాని నా కోణంలో ఆలోచించండి ... నాకు జ్ఞానం వచ్చినప్పటినుండి ఈ జీవితంతో అవిరామంగా పోరాడుతూనే ఉన్నాను. ఈ పోరాటంలో గెలుపు నాదే అవుతుందన్న విశ్వాసం నాకుండేది. నా కంఠం మధురంగా పల్కాలని సాధన చేశాను, నా వాయిద్యం నా చేతిలో అత్యద్భుత శబ్ద తరంగాల్ని సృష్టించాలని కృషి చేశాను. నా

### పంటి జబ్బులకి చిట్కా !

రోజా చిటికెడు సోడాఉప్పుతో పళ్ళు తోముకుంటే పంటి వ్యాధులను అరికట్టవచ్చు. ఇటీవలి కాలంలో పూర్తిగా మర్చిపోయినప్పటికీనీ, పూర్వం సోడాఉప్పును పళ్ళపొడిగా ఉపయోగించేవారు. దంత వ్యాధుల నివారణకు సోడాఉప్పు ఉపయోగం గురించి ప్రస్తుతం శాస్త్రీయ ఆధారాలు కూడా లభించాయి.

1978 లోనే అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు దంతవ్యాధులను అరికట్టడంలో సోడాఉప్పు, సాధారణ ఉప్పు ఉపయోగపడగలవని ప్రకటించారు.

ఇటీవలి కాలంలో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం శాస్త్రజ్ఞులు నోటిలో ఏర్పడే బాక్టీరియా పై సోడాఉప్పు (సోడియం బైకార్బొనైట్), ఎప్సంసాల్టు (మెగ్నీసియం సల్ఫేట్), సాధారణ ఉప్పు (సోడియం క్లోరైడ్)ల ప్రభావాన్ని పరీక్షించారు.

తక్కువ సాంద్రతలో సోడా ఉప్పు, మిగిలిన రెండు లవణాల కంటే బాక్టీరియాను మరింత చురుగ్గా నిరోధిస్తున్నట్లు కనుగొన్నారు.

హాబీలో అందమైన ఆకులు, లతలు, తీగలు,పూవులు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ సాఫల్యానికి కారణం నా కృషి. అంతేకాదు అవి జడపదార్థాలు. నా ఇష్టాన్ని వ్యతిరేకించే శక్తి, నా నుంచి పారిపోవాలన్న కాంక్ష వాటికి లేవు. వాటికి హృదయం లేదు. మన హృదయాలు సున్నితమైన గుణాలకు నిలయం. కనుక మీరు ఆలోచించండి...''

మాధవ్ కళ్ళు మూసుకుని వింటున్నాడు. అతి శ్రద్ధగా తిలకిస్తున్నాడు. ఆమె మాటల్లోని యదార్థానికి — తను సిగ్గుపడ్డాడుకూడ.

ఆమె కొంతసేపు మౌనంగా ఉండిపోయి తరువాత అంది ''ఆలోచిస్తారా ?''

మాధవ్ కళ్ళు తెరచి నిఠారుగ కూర్చున్నాడు ''ఆలోచిస్తాను. తప్పక ఆలోచిస్తాను... అన్నట్లు మీకు సంగీతంలో ప్రవేశం ఉందా ?''

అతడి కంఠంలో ఆత్రత — ఆమెకు చిరునవ్వు పుట్టించింది. ఆ అతిచిరువెలుగులో ఆమె మందహాసం చేస్తోందని అతడికి తెలియదు.

''ఔను. ఏదో కొద్దిగా పాడతాను.''

''ఇప్పుడు ఒక పాట పాడతారా ?''

''ఈమాటు. నాన్న అమ్మ వచ్చే వేళైంది. మిమ్మల్ని చూచి ఏమీ అనుకోరుగాని భోజనం చేసి వెళ్ళమంటారు. మీరు నిరాకరించలేరు. ఉన్నంతసేపు నా మాటల్ని మననంచేస్తూ పరధ్యానంగా ఉంటారు. మీరు బయలుదేరితే మంచిది... ఎల్లుండి వస్తారు కదూ ?... అసలు విషయం మీకు చెప్పాలి. ఇది తరువాత చూడండి'' అని ఒక కవరు చేతిలో ఉంచింది.

ఆమె లేచి కాస్త అవతలగా వెళ్ళి ''లక్ష్మీ'' అని పిల్చింది.

ఆ పిల్ల రాగానే ఏదో చెప్పి పంపింది.

''రండి...'' ఆమెలైట్ వేసింది. ఆమె వెనకాతలగా నడుస్తున్నాడు. అమల ఒక్కో గది దాటుతూ ముందు నడుస్తోంది. ''మరో విషయం. డబ్బుతో అత్యంత ముఖ్యమైన అవసరాల్ని తీర్చుకోవాలి — ఆర్థిక ఇబ్బందులనుండి విముక్తి పొందాలి... కాని... పైపై మెరుగుల కోసం, లగ్జరీల కోసం ఆరాటపడటం మీ దృష్టికి రాలేదనుకుంటాను.''

''లేదు. ఏం... కావాలన్నారా ?''

''మీరే ఇంట్లో అడగండి. డబ్బు విషయం పట్టనట్లుండకండి. ప్లీజ్...'' వేడికోలుగా అంది.

బైటకొచ్చారు. కారు ఆగి ఉంది. డ్రైవర్ డోర్ తీసి పట్టుకున్నాడు. ''వెళ్ళొస్తాను. ఎల్లుండి వస్తాను'' అని కారెక్కాడు.

తలుపు మూసి డ్రైవర్ తన సీట్‌లోకి వెళ్తున్నాడు. ఆమె పై మెట్టుమీదనే నుంచుని ఉంది. మాధవ్ తల ఎత్తాడు. ఆమె అప్పుడే వెనుదిరిగింది. కాని ఆ క్షణంలో ఆమె కళ్ళలో మెరిసిన కన్నీటి పొరను అతడు గమనించకపోలేదు. భారభరిత హృదయంతో వెనక్కి వాలి ''బర్‌కత్‌పుర వై.యం.సి.ఏ. దగ్గర దింపు'' అన్నాడు.

కుషన్‌మీద చేరబడి గబగబ కవర్ చింపాడు.

చిన్న కాగితం ... దానిమీద ఇలా రాసివుంది.

''మీ కుటుంబం ప్లస్ డబ్బు. వీరినుండి మీరు మైనస్. ఇదంతా కలిస్తే సున్నా... అంటే నేను.

మీ కుటుంబం + డబ్బు — మీరు = 0.

ఈ సున్నాను మన భారతీయులు కనిపెట్టారు.

ఆ సున్నాలాగున నేను ఉండలేను..''

దాన్ని పదే పదే చదివి జేబులో పెట్టుకున్నాడు.

ఎంత స్పష్టంగా చెప్పింది.

అచ్చం అట్లాగే ఉండాలను కున్నాడు.

వెనక్కి జేరబడి కళ్ళు మూసుకున్నాడు.

సున్నా... ఒక్కటి కాదు ఎన్నో సున్నాలు... వలయాలుగ ఒకదాని వెంట ఒకటి తరుముకు వస్తున్నాయి. చిన్న వలయం ఆ తరువాత గ్రాడ్యుయల్‌గా పెద్దవి ... ఎన్నో ... ఆ వలయాలు ఎక్కడి నుండి వస్తున్నాయి ! సుడిగుండం ... అది తనలో లీనమైపోతున్నాయి. తనను బంధించి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆ సుడిగుండంలో తను పడిపోతున్నాడు .........

బ్రేక్ కుదుపుకు మాధవ్ చటుక్కున కళ్ళు తెరిచాడు. ఎందుకీ విధంగా బాధ పడుతున్నాడు !

ఈ పెళ్ళి వల్ల తను సుడిగుండంలో చిక్కుకుపోయినట్లుగ అయిపోతాడేమో —

ఆమెను తను లెక్కచేయడు - అందుకని మిగతావారు నిర్లక్ష్యం చేస్తారు — డబ్బు వాళ్ళ చేతిలో ఉంటుంది .. తను కూడ సున్నాలాగున అయిపోతాడు. ఒకనాడు ఈ త్యాగానికి విలువ ఉండదు, తనకు ఏదీ మిగలదు తను ఒక అనామకుడుగా మిగిలిపోతాడు.

ఉహు ... అట్లా కాకూడదు.

తను మూడ్ పార్టీగా ఇకపై ఉండకూడదు ఈ పెళ్ళి ఏ పరిస్థితులలోను తప్పిపోనప్పుడు దీని వలన తను ఆనందంగా సుఖంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి. దీనికి కారకురాలైన ఆమెను శూన్యగృహంలో ఒదల కూడదు.

తను ఎందుకు విరాగిలా తలంచాడు? మరో వ్యక్తిని తన భాగస్వామిగా పదిమంది ఎదుట స్వీకరించి ఆమెను తెచ్చి తనింట్లో పడెయ్యాలను కున్నాడు. ఆమె చూడటం— సరదాగా తిరగటం— అసలు ఆమెను తన అర్థాంగిగా పిలుకోవటాన్ని— ఏదీకూడ క్రమపద్ధతిలో మామూలు మగవాడిగా తను ఆలోచించలేదు.

చిన్న సంఘటన ఊహించుకున్నాడు.''సినిమాకు వెళ్దాం'' అని చెల్లి అంటుంది. అంతా తయారవుతారు. ''నువ్వెందుకు నువ్వు మాధవ్ వెళ్ళండి'' అంటుంది తల్లి.

''అన్నయ్య అసలు తీసుకెళ్ళడు— వదినతో వెళ్ళటం సిగ్గు'' అంటుంది చిన్న చెల్లి— ''నీకు సినిమా తక్కువైందా?'' అంటాడు తను !

ఎంత ఘోరం !


అలాగే— ఒకవేళ అమల చక్కటి చీర కట్టుకుంటే ''నీకిది బాగలేదు వదినా'' అంటే చాలదూ?


''చందమామకు మచ్చ ఉన్నట్లు వదినకు మచ్చ...''

''మచ్చ ఉన్నా చందమామకు అందం ఉంది కాని...''

అంతా ఘొల్లున నవ్వుతున్నారు.

(ఇంకా ఉంది)



పెద్ద కథ

# తొణికని స్వప్నం

కోమలాదేవి

(గత సంచిక తరువాయి)

వాళ్ళంతా ఒకట్టైపోయారు. అమలను అందరికి దూరంగా ఉంచేశారు.

మరి ! తనను కూడ దూరంగా ఉంచేస్తారు. అది సహజం — తను ... అమల దూరంగా ఉన్నంతవరకు వారందరు కోరినది పొందుతు సుఖంగ సలక్షణంగా ఉంటారు. అమల తనమధ్య మమతాను రాగాలకు చోటు ఉండనంతా మంచిదే — అనుకుంటారా ... తండ్రి మొన్న ఏమన్నాడూ "డబ్బు తెచ్చినందుకు నీ మీద పెత్తనం చెలాయించకుండా చూస్తాను. డబ్బు మన చేతిలో ఉంటుంది. మన ఇష్టప్రకారం వాడుకుందాం. మన విషయాల్లో ఆమె జోక్యం కల్గించుకోకుండా చేస్తాను. నీకు కూడ ఈ బాధ్యతలెందుకు ? హాయిగా ఉండు —" అనలేదూ! దాని అంతరార్థం బోధపడి బాధపడ్డాడు. అప్పుడు ఏం పట్టనట్లు 'సరే' అన్నాడు మాధవ్ !

చౌరాస్తా దగ్గర దింపి వెళ్ళిపోతూ డ్రైవర్ నమస్కరించాడు. అక్కడ నుండి నడుచుకుంటూ ఇల్లు జేరాడు.

తల్లి ఎప్పటి మాదిరిగానే అతడి కోసం కనిపెట్టి ఉంది. ఆమె అనవసరంగా ఏమీ ప్రశ్నించలేదు. ఇద్దరు భోంచేసి ఇవతలికి వచ్చారు. ఆ రాత్రి చాలసేపు ఆలోచిస్తూ పడుకున్నాడు.

అమల అడిగిన ఒక్కొక్క ప్రశ్నకు జవాబు వెతుక్కున్నాడు. ఆ రోజు రాత్రి ప్రప్రథంగా ఈ పెళ్ళిని గూర్చి మరో దృష్టితో ఆలోచించాడు. ఆఖరుగా ఆమె హెచ్చరింపును మననం చేసుకున్నాడు. అందులో ఎంత యదార్థం ఉంది ? కనుక్కోవాలి — అని నిశ్చయించుకున్నాడు.

ఉదయాన కాఫీ గ్లాస్ పుచ్చుకుని తండ్రి దగ్గరకు వెళ్ళాడు. "నిన్న డబ్బు తెచ్చుకుందాం అంటే— ఆదివారం వెళ్దాం అన్నాను. ఎంత ఇస్తున్నారేమిటి ?"

"ఎంతో లేదు. ప్రస్తుతం ఈ ఇంటి రిపేర్ చేయించమన్నాడు. ఆ తరువాత రెండు గదులు కట్టిస్తారు."

"అదే లెండి. ఎంత ఇస్తారట ?"

"అరవై వేలు" అదెంతో చిన్న మొత్తంలా చెప్పేసరికి మాధవ్ నిర్ఘాంతపోయాడు. రిపేర్‌కు అరవై వేలా ? రెండు గదులకు ఇంకెంత ఇస్తారు? అసలు తనను ఎంతకు అమ్మేస్తున్నాడు తండ్రి.

"అరవై వేలా?" అన్నాడు గ్లాస్ క్రిందపెట్టి.

"ఊ... మరి ఈ ఇంటికి ఎంతపని ఉందో"

తన హృదయంలోని అలజడిని కప్పివేస్తూ ఫకాల్న నవ్వాడు. "ఈ ఇంటికి అంత రిపేర్ పని ఉందన్న సంగతే నాకు తెలీదు" అనగా — తండ్రి కూడా హాయిగా నవ్వాడు. వాతావరణం సడలినట్లుగా ఉంది. ఇదే తగిన సమయం అని మళ్ళీ గ్లాసు అందుకుని ప్రశ్నించాడు "కుసుమను చేసుకుంటాం అని వాళ్ళు ఉత్తరం రాశారుకదా? మరి వెళ్ళారా?"

"లేదు...ఆలోచిస్తున్నాను" తండ్రి నాన్చుతూ జవాబివ్వటంలో ఏదో ఉందని పసిగట్టాడు. నిన్న సాయంత్రం జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది. వీళ్ళ ఉద్దేశాన్ని అమల ఊహించిందా ?

"నా పెళ్ళికి ముందు కుసుమ పెళ్ళి చెయ్యాలనుకున్నాం. గట్టిగానే అనుకున్నాం. ఇంకా ఆలోచించటం ఏమిటి— ఆ రోజు — ఈ సంబంధమైనా స్థిరపడితే బావుండును అని దేవుళ్ళకు మొక్కుకున్న విషయం మర్చిపోయారా ? కుసుమకు ఇరవై ఐదేళ్ళు దాటాయన్న సంగతి మర్చిపోయారా ?" కాస్త కటువుగా అన్నాడు.

ఎన్నడు లేనిది ఆ రోజు గోపాలరావు కొడుకు దగ్గర మాట్లాడలేకపోయాడు. మెల్లగా అన్నాడు "కుసుమకు నచ్చలేదట".

"అసలు నచ్చలేదు — నచ్చింది అనటానికి స్తోమత ఉందా కుసుమకు ? అట్లా అనగానే మీరు ఎట్లా ఊరుకున్నారు నాన్నా... కుసుమా ఇలా రా..." అని కేకేశాడు క్రోధంతో.

కుసుమ ఏమిటో అని గబగబ వచ్చింది.

"ఏం ? రవీంద్ర నచ్చలేదన్నావట ? అసలు నీ ఇష్టాన్ని ఎవరడిగారు ? ఒద్దు అనటానికి కారణాలు ఆ రోజు మన కెవ్వరికి కనబడలేదు. ఈ రోజు ఎలా అనగల్గుతున్నారు ?"

"ఏం లేదు. మరికాస్త మంచి సంబంధం తెద్దామని" తండ్రి మెల్లగా అన్నాడు.

కుసుమ తల వంచుకుంది.

"ఐదేళ్ళనుండి మరికాస్త మంచి సంబంధం తేలేకపోయాము. ఇకమీదట తేగలమా ? ఇప్పుడే రాసేద్దాం వస్తున్నామని. మనమిద్దరం వెళ్ళి ముహూర్తం పెట్టించుకుని వద్దాం. ఒక్క పెళ్ళితో మన ఖర్చులు పూర్తికావు. ప్రతి పండక్కి, ప్రతి పురిటికి ఉంటాయి ఖర్చులు."

మాధవ్ వెళ్ళి కాగితం కలం తెచ్చి తండ్రి చేతికిచ్చాడు. ఈలోపల ఏం సైగ చేసుకున్నారో గాని — గోపాలరావు ఉత్తరం ప్రారంభించబోతుంటే కుసుమ అంది "నాకు నిజంగానే ఇష్టంలేదు" ఆమె కంఠంలోని నిరసన, మొండితనంకు మాధవ్ నిర్ఘాంతపోయాడు. కుసుమ నోట అటువంటి మాట విన్నాడంటే దానికి మద్దతు ఉండాలి. ఎవరిచ్చారు ?

"నాన్నా — ఏమిటిది ?" కాస్త తేరుకుని అడిగాను.

కలాన్ని ప్రక్కనబెట్టి కొడుకువేపు వేడికోలుగ చూచాడు "కుసుమకు ఇష్టంలేదు" అన్నాడు మెల్లగా.

మాధవ్‌కు కోపం వచ్చింది. అమల మాటల్లోని నిగూఢార్థం తెలుస్తోంది. అతడి హృదయం ఈ నిర్ణయాన్ని సహించలేకపోయింది. నిస్సత్తువతో కూర్చుండిపోయాడు.

"ఈ ఇంట్లో ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. నాకు జ్ఞానం వచ్చినప్పటినుండి ఇచ్చింది పుచ్చుకున్నాం — ఒద్దన్నదాన్ని విడిచిపెట్టాం. కావాలనుకున్నదాన్ని పొందలేకపోయాం. ఇప్పుడు మీరు కుసుమకు నచ్చచెప్పకుండా ఆమె అసమ్మతిని తెలియజేస్తుంటే సరే — అంటున్నారు. ఎవరు మాత్రం ఇష్టమైన పెళ్ళి చేసుకుంటున్నారు ?... మీ ఇష్టం... కాని తొందరపడి వాళ్ళకు రాసెయ్యకండి. నేను అమ్ముడుపోతున్నది ఎందుకో నువ్వు అర్థం చేసుకునివుంటే ఈ తెగింపు నీలో వచ్చేది కాదు" మాధవ్ అక్కడి నుండి తల్లి దగ్గరకు వెళ్ళాడు ఆమెకు చెప్పి తండ్రిని, కుసుమని ఒప్పించేలా చేయటానికి. కాని ఆమె కూడా బతిమాలుతున్నదాన్లా అంది "మరీ — టెలిఫోన్ ఆపరేటరా? అని బాధ పడ్తోంది మాధవ్...?"

ఆ సంభాషణ ఇక వినలేక పోయాడు. చివ్వున లేచి వచ్చేశాడు. క్రితం సాయంత్రపు సంభాషణలో వ్యంగ్యం— ఎకసెక్కెం— చులకనా భావం— అగౌరవం— అమలను— చక్కనమ్మ అనటం—డబ్బు తమ స్వంతం అన్నట్లు కోరికలు కోరటం— వీళ్ళు సరే అనటం... అదంతా ఇప్పుడు విముఖత కల్గిస్తోంది. ఆ సంభాషణను ఆలకించి సంతృప్తి జెంది తన త్యాగం సరియైనదే అనుకున్నాడు. స్నానం చేసి వచ్చాడు. మనసు కాస్త ప్రశాంతమైంది. తను అంత త్వరగా వీళ్ళను అంచనా వేయకూడదు. కాస్త మంచి ఉద్యోగస్తుణ్ణి భర్తగా పొందాలని ఎవరికుండదు ! ప్రశాంతచిత్తుడై తల్లి దగ్గరకు వచ్చాడు.

"అమ్మా ఎనిమిదిగంటలకంతా వెళ్ళిపోవాలి ఈ రోజు. ఏది తయారుగా ఉంటే అదే పెట్టు— అరగంటకంతా వస్తాను" లాల్చి పైజామా వేసుకుని బైటకెళ్ళిపోయాడు.

"హమ్మయ్య" అనుకున్నారు ముగ్గురు. ఏదో అట్లా అన్నాడేగాని తరువాత అన్నిటికి బుర్ర ఊపుతాడు— అనుకుని సంతోషించారు.

మాధవ్ తిన్నగా ప్రక్కవీధిలో ఉండే హోటల్ కెళ్ళాడు. అక్కడ పబ్లిక్ ఫోన్ బూత్ ఉంది. అమల ఇంటికి ఫోన్ చేశాడు.

నౌకర్ అందుకున్నాడు. మాధవ్ పేరు వినగానే "అయ్యగార్కి చెబుతాను. ఆగండయ్యా" అన్నాడు.

ఐదు నిమిషాలకంతా అమల తండ్రి రాజేంద్ర

ప్రసాద్ ఫోన్ అందుకున్నారు "రాజేంద్రప్రసాద్‌ను మాట్లాడుతున్నాను."

"నేనండి— మాధవ్‌ను."

"ఓ... మాధవ్... కులాసానా ?"

"కులాసాగానే ఉన్నానండి. ఈ వారంలో కొంత డబ్బు ఇస్తామన్నారుట...దాని విషయం..."

"ఔనౌను... ఎప్పుడన్నా రావచ్చు... సిద్ధంగా ఉంచాను."

"ఎంత ఇవ్వాలనుకున్నారు ? ఇట్లా అడుగుతున్నందుకు అన్యథా..."

"నో... నో... నేను ఎంత ఇవ్వాలనుకున్నానో గాని— మీ నాన్నగారు డెబ్భై ఐదువేలు అడిగారు... ప్రస్తుతం..." మాధవ్ అవాక్కయిపోయాడు.

"మాధవ్... ఉన్నావా ?" ఆయన ఆత్రంగా అడిగాడు.

"ఉన్నానండి"

"ఏం... ఇంకొంచెం ఎక్కువ కావాలా ? ఒకటి చెయ్యనా"

"థాంక్స్... ఒద్దండి... సరే... వినండి... మీరు పెద్దలు. అయినా నాకు ఒక వాగ్దానం చెయ్యాలి."

"అది ఏమిటో — అంత ఇదిగా మాట ఇవ్వలేను."

"చాల చిన్న విషయం. ఈ వాగ్దానం చెయ్యటం ద్వారా మీరు ఏ నియమాలను తప్పరు. మీరు ఇచ్చే డబ్బు... ఒక్క రూపాయి కూడ ఎవ్వరికి ఇవ్వకూడదు. ఏది ఇచ్చినా నాకే ఇవ్వాలి. ఒప్పుకుంటారా ?" మాధవ్ ఆవేశంగా మాట్లాడుతున్నాడు.

"ఎందుకు ? ఏమైంది?" ఆత్రంగా అడిగాడు

"ఏమీ కాలేదు. మా ఇల్లు రిపేర్ చేయించాలి కదా ? రిపేర్ అవుతున్నకొద్దీ డబ్బు తీసుకుంటాను."

రాజేంద్రప్రసాద్ పెదిమల్లో సన్నటి వక్రమైన నవ్వు చోటు చేసుకుంది... "కుర్రాడు తెలివిగలవాడే... రిపేర్ అయ్యేకొలది డబ్బు తీసుకుంటాడట! తండ్రికి మించినవాడుగా ఉన్నాడు... చూద్దాం... అదెంత అవుతుందో"

"అలాగే. మాట ఇస్తున్నాను... కాని ఆ రిపేర్‌కు ఎంత డబ్బు తయారుగా ఉంచమంటావ్ ? ఇంట్లో అంత డబ్బు ఉంచను. బేంక్‌లోంచి తియ్యాలి" అన్నాడు — ఈ దెబ్బతో మాధవ్ వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు.

"మేస్త్రీని పిలిపించి అడగాలి. ఎంత లేదన్నా



పది పదిహేను వేలు కావచ్చు. రెండు మూడు వేలు అటూ ఇటూ ఉంచండి.''

తను సరిగానే విన్నాడా? ''ఎంత?'' వినబడనట్లు అడిగాడు ప్రసాద్.

''ఇరవై ఉంచండి. కాని ప్రస్తుతం పదిహేను తీసుకుంటాను.''

రాజేంద్రప్రసాద్ ముఖం గంభీరమైంది. ఇంతవరకు ఏ విషయంలో జోక్యం కల్గించుకోని మాధవ్ — డబ్బు విషయం వచ్చేసరికి అంతా నాన్న చూచుకుంటారు — అనే మాధవ్ ఇట్లా మాట్లాడుతున్నాడంటే అది ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది.

''మాధవ్ అంత చాలా?'' మెల్లగా అడిగాడు.

''చాలునండి. రేపు సాయంత్రం వచ్చినప్పుడు తీసుకుంటాను'' అని నాలుక కరచుకున్నాడు.

ఆయన అలాగే అన్నాడు.

నమస్కారం అని ఫోన్ పెట్టేశాడు. అప్రయత్నంగా ఆతడి పెదిమల్లోంచి సన్నటి ఈల వినబడింది. కాని ఒక్కసారి ఏదో భయంకరమైన సందేహం ఆతడి గుండెల్లో బరువుగా దిగబడి పోయింది.

తను తన తండ్రిని చులకన చేశాడా?

తన త్యాగాన్ని వాళ్ళు దుర్వినియోగం చేస్తారేమో అన్న అనుమానంతో తను ఇట్లా ప్రవర్తిస్తున్నాడా? లేక ఎక్కడో తన స్వార్థం ఉన్నదా?

లేదు — అమల అడిగినప్పుడు తెల్లమొహం వేశాడు. ఎంత డబ్బు తన తండ్రి తీసుకుంటున్నది తనకు తెలియదా! ఎంత సిగ్గుచేటు!

ఇంటికెళ్ళి గబగబ భోంచేసి ఆఫీస్‌కు వెళ్ళిపోయాడు. ఎవరితోనైన మాట్లాడాలనిపించింది. రాజు మరోచోట ఉంటాడు. సాయంత్రం ఐదు గంటలవరకు ఎలాగో గడిపి సాయంత్రం ఇల్లు చేరాడు. తను మామూలుగా ఉన్నట్లు పండ్లు కొనుక్కొని వెళ్ళాడు. కొడుకు సరదాగా ఉండటం గమనించి ఆ తలిదండ్రులు మనసులో పొంగిపోయారు.

కాని ఆ రాత్రి తండ్రిని మళ్ళీ హెచ్చరించాడు. ''రవీంద్ర సంబంధం ఒదులుకోవద్దండి'' అని. రాజును కలుసుకుని చాలసేపు చర్చించాడు. మరుసటి రోజు సాయంత్రం ఆలస్యంగా వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

రోజ్‌విల్లా చేరేసరికి ఆరుంబావు అయింది. ఈసారి ఆమెవచ్చి ఆతణ్ణి లోపలికి తీసుకుని వెళ్ళలేదు. మరో గదిలోంచి గులాబి తోటలోకి తీసుకుని వెళ్ళింది లక్ష్మి.

''అయ్యా ఇక్కడ కూర్చోమన్నారు'' అని గార్డెన్ చెయిర్స్ చూపించింది. నక్షత్రాకారంలో ఉన్న చిన్న లాన్ అది. చుట్టూ గులాబి మొక్కలు. కాలం కానందువల్ల కొన్ని పూవులు మాత్రమే ఉన్నాయి. ప్రక్కగా చిన్న విశ్రాంతి మండపం దాన్ని అల్లుకుపోయిన లతలు స్వాప్నిక జగత్తులోనికి లాక్కుపోతున్నాయి. తనను లక్ష్మి గ్లాసునిండా బాదం ఖీర్ తెచ్చిపెట్టింది ''అయ్యా తీసుకోండి. అమ్మగారు వస్తారు'' లక్ష్మి వెళ్ళిపోయింది. ఒక సిప్ తీసుకుని ఆ సుందర మండపాన్ని చూస్తున్నాడు. ఎక్కడనుంచో మంద్ర స్వరంలో శ్రావ్యమైన రాగా

## తొణకని స్వప్నం

లాపన వినబడింది. ఎక్కడో ... దూరాన ... అతి దూరాన వినబడినట్లుగా ఉంది. కాస్త దగ్గరగా వినవస్తే బావుండుననుకున్నాడు. సితారు వాయిద్యం శబ్ద తరంగాలతో మేళవించి చక్కగా పాడుతున్నారు. అతి సమీపంగా వచ్చినట్లు ధ్వనించింది పాట ... అదొక చక్కటి భావగీతం ...

కలహంస స్వరధునిలో
మలయా నిల మధురిమలో ...

ఆ మలయ మారుతంలో— ఆ మధురమైన ఎనసీమలో — ఆ కోయిల పాటలో... జలజల పారే సెలయేటి నీటి సవ్వడిలో ఆతడి హృదయం రంజిల్లింది. పాట పూర్తయి పోయింది.

అప్పటికిగాని అతడికి స్ఫురించలేదు. లోపల గదుల్లో ఎవరో టేప్‌రికార్డర్ పెట్టుకున్నారు.

## వృద్ధులకు పత్రికలు !

జపానులో ప్రజలకు పత్రికల పట్ల ఆసక్తి ఎక్కువ. ఒక రకంగా చెప్పాలంటే, పత్రికా పఠనం జపాను ప్రజల హాబీ అని చెప్పవచ్చు. అందులో వృద్ధులకు విశ్రాంతి సమయం ఎక్కువగా లభిస్తుంది కనుక, వారికి ఆసక్తి కూడా ఎక్కువగా ఉంటుంది. పైగా జపాన్ దేశంలో వృద్ధుల సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. అందువలన జపాను దేశంలో వృద్ధులకోసం ప్రత్యేక పత్రికలను ప్రచురించటం ప్రారంభించారు. వీటిని జుకునెన్ మాగజైన్స్ అని అంటారు. సాధారణంగా 45 సంవత్సరాల వయస్సు వచ్చిన వారిలో విజ్ఞాన తృష్ణ ఎక్కువగా ఉంటుందని ఒక పత్రికా సంపాదకుడు తెలియచేస్తూ, ''వీరిలో ఆధ్యాత్మికదాహం ఎక్కువ.'' అని అన్నారు. వీరు జీవితం పట్ల కొత్త దృక్పథంతో ప్రశ్నించుకుంటారు. ఆ ప్రశ్నలకు సమాధానాలను లేక క్లూలను ఈ పత్రికలు అందచేయగలవని ఆయన అన్నారు.

కొంతసేపటికి అమల వచ్చింది. పళ్ళెంలో గారెలు తెచ్చి బల్లమీద పెట్టింది.

''మీకు పాట వినబడిందా? సారి ... పనిమీద ఉన్నాను. వెంటనే రాలేకపోయాను.''

''ఫరవాలేదు. ఇది త్రాగుతూ పాట వింటూ ఉంటే మనసు హాయిగా అలా అలా తేలిపోయింది — ఒక మధురమైన స్వాప్నిక జగత్తులోనికి తీసుకుని వెళ్ళింది. ఎప్పుడైన పూర్తి టేప్ వినాలి — వినిపిస్తారా?''

''అలాగే... కాని టేప్ కాదు. నేను పాడాను.''

''అది మీ పాటనా?'' ఆశ్చర్యంతో అడిగాడు.

''ఔను. వాయిద్య సంగీతం మాత్రం టేప్ చేసి ఉంచాను. నిన్న పాడమని అడిగారుగా'' అంది.

ఆతడు కళ్ళు మూసుకుని ఆ గానమాధుర్యాన్ని అనుభవిస్తున్నట్లు తల మెల్లగా ఆడించాడు.

''థాంక్స్... చాల బాగా పాడారు... ఎక్కడైన ప్రోగ్రాం ఇచ్చారా?''

''రేడియోలో అప్పుడప్పుడు. అంతేగాని ప్రోగ్రాం అంటూ ఏమీ ఇవ్వలేదు. ఇంట్లో ఏదైన ఫంక్షన్ జరిగితే పాడుతుంటాను. నాన్నగారు వాయిద్య బృందాన్ని పిలిపిస్తారు'' అంది. ''తీసుకోండి'' అని పళ్ళెంముందరికి త్రోసింది.

మాధవ్ గారె తీసుకుని ''మీరు కూడ తీసుకోండి''

''ఇందాకనే తీసుకున్నాను...మీరు నేను కోరినట్లు ఆలోచించారా?'' ఆమె సీరియస్‌గా ప్రశ్నించింది.

మాధవ్ నవ్వాడు ''ఇన్ని రోజులు ఆలోచించటం మానేశాను. తటస్థంగా ఉండిపోయాను. చివరికి ఆలోచించటం ప్రారంభించిన తరువాత ఆ ఆలోచనల్ని అరికట్టలేకపోతున్నాను. ఒక్క అంశం మీద ఆలోచించి తగిన చర్య తీసుకోటానికి ఈ రెండు రోజులు పట్టాయి.''

''చాల థాంక్స్ మీకు ... ఇంతకు ఇంటి విషయం ఏం చేశారు?''

మాధవ్ మాట్లాడలేదు. ఆ విషయం దాకా తను రాలేదు. ఆ మాట చెప్పాలనుకున్నాడు — కాని ఆమె అంది... ''చూచారా? ఒక చిన్న ఈక్వేషన్ ఇచ్చాను. దానిని మీరు విడమర్చి చెప్పాలి'' అందామె,

''మిమ్మల్ని సున్నాగా ఉంచటం నాక్కూడా ఇష్టంలేదు మీరు ఒక్కటి గ్రహించాలి. ఉన్నట్లుండి నేను ఇంత శ్రద్ధ తీసుకుంటే మావాళ్ళు అపార్థం చేసుకుంటారు? అందుకే టైం కావాలి''

ఆమె నవ్వింది. మూతికి కొంగు అడ్డం పెట్టుకుంది. తన కోరపన్ను నవ్వినప్పుడు బైటికొచ్చి అసహ్యంగా ఉంటుందని అట్లా అడ్డం పెట్టుకుంది.

''మామూలు భాషలో చెప్పాలంటే 'ఆ మాన్యుగారు ఆ పిల్ల మందు పెట్టి మా అబ్బాయిని వాళ్ళ వైపుకు త్రిప్పేసుకున్నారు —' అని.

''ఔను. చాల జాగ్రత్తగా మసలాలి. ఎవరికెంత స్వార్థం ఉందో మెల్లగా తెలుసుకుంటాను.''

''స్వార్థం అందరికి ఉంటుంది. మీ ఒక్కరిలో ఇంతవరకు లేదు... కాని స్వార్థం హద్దుమీర కూడదు'' అంది అమల.


''మీ నాన్నగార్కి చెప్పాను — డబ్బు నా చేతికే ఇవ్వాలని.''


''ఐతే — మొట్టమొదటి అడుగు తెగించి వేశారన్న మాట. ఆ తరువాత అడుగులు సునాయాసంగ పడిపోతాయి. మిమ్మల్ని అభినందిస్తున్నాను.''

''థాంక్స్... నిన్న అన్నారు ముఖ్యమైన విషయం మాట్లాడాలని!''

''నాన్నగారితో మీ నాన్నగారు అన్నారట డబ్బు తనదగ్గరే ఉంచుకుంటారట. మీకే డబ్బు గొడవలు తెలీవట. డబ్బును జాగ్రత్తగా ఎలా వాడుకోవాలో కూడ తెలీదట. నిజంగా మీ నాన్నగారి ఆర్థిక ఇబ్బందులు మీకు తెలియవా?''

''తెలుసును. మేము ఉంటున్న ఇల్లు తాకట్టులో ఉంది. మా పెద్ద చెల్లి కుసుమ పెళ్ళి చేయాలి. సాధారణ కుటుంబాలలో ఉండే ఆర్థిక సమస్యలు మీకు తెలియకపోవచ్చును. ఎన్నో చిల్లర




అప్పులుంటాయి. అంతేకాదు ఈ ఉద్యోగం కోసం నేను దాదాపు పదివేలు అప్పు జేశాను. నా ఫ్రెండ్ రాజు ఇచ్చాడు. ప్రతి నెల రెండొందల చొప్పున తీర్చాలి.''

"అదేలెండి ఈ పెళ్ళి మీ ఇష్టప్రకారం జరగటంలేదు. కాబట్టి— కోపంతో లేక నిస్పృహతో అని ఉంటారు. నాకీ డబ్బు విషయాలేం చెప్పకండి. ఏమన్నా చేసుకోండి – మీ ఇష్టం – అని'' అంది మెల్లగా.

"ఔను. ఆ రోజుల్లో అట్లాగే అన్నాను. కాని మనసు మార్చుకున్నాను. కనీసం నేను ఎంతకు అమ్ముడుపోతున్నానోకూడ నాకు...''

"ప్లీజ్— అట్లా మాట్లాడకండి'' అంది బాధగా.

"అంతేకదా—'' అన్నాడు విసురుగ.

ఆమె మాట్లాడలేదు.

"సారి... అట్లా అనను... సరే...చెప్పండి... ఆ డబ్బు నేను తీసుకుని అవసరమనుకున్నదానికి వాడి మిగిలింది మనకోసం ఉంచుకోవాలి. అంతేకదూ?''

"ఔను. ఈ పెళ్ళి ఎంత ఇష్టంలేకపోయినా మీరు ముఖ్యపాత్ర వహిస్తే మంచిది. వాళ్ళంతా ఎంత సొంతమైనా మూడో పార్టీయేకదా ?''

"ఔను... ఒకనాడు మిగిలినది కూర్చుకుందాం అంటే ఏమీ మిగలకపోవచ్చును... ఇంకా ఏమైనా చెప్పాలా ?''

"మిమ్మల్ని చూస్తే నాకు చాలా జాలిగా వుంది. ప్రతి ఒక్కరు మిమ్మల్ని తోలుబొమ్మలా ఆడించటం చూస్తుంటే— ఈ పరిస్థితి నుండి మిమ్మల్ని తప్పించటానికి రెండు మార్గాలున్నాయి... చెప్పమంటారా ?''

"చెప్పండి'' అంత ఉత్సాహం కనబర్చలేదు.

"ఒకటి... చాల రోజులుగా ఆలోచించాను. నాకు మరొకరి సహాయం కావలసి వచ్చింది. అన్నయ్యకు రాశాను. అర్థం చేసుకున్నాడు చదవండి. ఇది ఆమె ఒక తెరిచిన కవర్ అందించింది.

మాధవ్ దాన్ని అందుకుని అడ్రస్ చూచాడు. అమల పేరు ఉంది. తాపీగా అందులోని కాగితాన్ని తీసి చదవటం ప్రారంభించాడు. ఆతడి ముఖంలో మారే రంగుల్ని అతి జాగ్రత్తతో గమనిస్తోంది అమల.

మాధవ్‌ది ఎంత సుందరమైన రూపం...! ఆతడి పెదిమలు అదురుతున్నాయి! ముఖంలో క్రోధం తాలూకు ఎర్రదనం పరచుకుంటోంది. ఎద త్వరితగతిని లేచి పడ్తుంది. ఆతడు చదవటం పూర్తయింది. ఆ ఉత్తరాన్ని కసిదీరా నలిపి అమల వైపు విసిరికొడ్తూ— కోపంతో అన్నాడు.

"అమలా— ఏమిటిది! నీ లెక్కలబుర్ర అఖండమైనదనుకున్నాను. ఇలాంటి సలహా ఇవ్వటానికి నీకెంత ధైర్యం ? ఆజన్మాంతరం నీ అప్పు తీరుస్తూ కూర్చోమంటావా? అమ్మా నాన్నలకు తెలియకుండా మీ అన్న నాకు డబ్బు ఇస్తాడా ? ఆ డబ్బుతో నేను అప్పులు సప్పులు తీర్చి ఎవరినైన పెళ్ళాడి చచ్చేదాక కొద్దికొద్దిగా డబ్బు మీ అన్నయ్యకు పంపుతుండాలా ! ఆహా... అమోఘ మయిన మార్గం... కంగ్రాట్స్...నీ అతితెలివికి...'' వేళాకోళంగా అన్నాడు.

అమల ప్రప్రథమంలో విస్తుపోయింది. ఆ తరువాత అతని ఏకవచన ప్రయోగం మొదటి సారిగా ఆమెలో అణగారి వున్న ప్రేమ జ్యోతిని దేదీప్యమానంగా వెలిగించింది. ఆమె హృదయం ఆనంద తరంగాలపై ఓ ల లా డిం ది. ఆమె బాగా తల వంచుకున్నది. తన హృదయంలోంచి పొంగి పొరుతున్న ప్రేమను అతడు గ్రహిస్తాడేమోనన్న భయంతో తల బాగా వాల్చుకున్నది. తన జీవితంలో రాదు – అనుకున్న వసంతం విచ్చుకుంది. తన తెలివిని ఖండిస్తూ—వ్యంగ్యంగా అభినందించటం ప్రోత్సాహంగా ఉంది – ప్రోత్సాహకరంగాను ఉంది.

అతడు సిగ్గుపడ్డాడు ... "సారి ... కోపంవచ్చి రెచ్చిపోయి మాట్లాడాను ... '' అన్నాడు మెల్లగా.

అమల మాట్లాడలేదు.

వైవిధ్యంగల వ్యాసాలకు
భారతి మాసపత్రిక
చదవండి!

"రెండోది చెప్పండి'' సవాలు చేసినట్లు అడిగాడు.

"మీకు కోపం వస్తుంది'' అంది.

"ఫరవాలేదులెండి. అది ఇంకెంత బ్రిలియంట్ ఐడియానో చూస్తాను ... ''

అమల ప్రారంభించింది. మనసు ఎంతో ఉల్లాసంగా ఉంది.

"మీరు ముచ్చటైన ఇల్లు కొనుక్కోండి. దాన్ని అనుకూలంగా ఉండే చక్కటి ఫర్నిచర్‌తో నింపండి. మీ చెల్లికి పెళ్ళి చేయండి. మీ ఇల్లు తాకట్టునుండి విడిపించండి. రిపేర్ చేయించండి. తమ్ముడిని ఏదైన ఉద్యోగంలో ప్రవేశపెట్టండి. తలిదండ్రులకు నెలనెల కొంత పంపుతూ ఉండండి. డబ్బుంటే జీవితంలో ఎన్నో సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కోవచ్చు'' ఆమె ఇంకా ఏమైన చెబుతుందేమో నని ఆత్రంగా చూశాడు. కాని అమల వంచిన తల ఎత్తలేదు.

బహుశా చిన్నప్పటినుండి అది ఆమె బలహీనత కాబోలు – తన ముఖం పూర్తిగా కనబడకూడదని అలా వంచుకుంటుందేమో. ధైర్యంగా తలెత్తి కళ్ళలోకి సూటిగ చూచి మాట్లాడదేం ?

"మరి అన్నీ చెప్పావు ... మరి నీ మాట ... నీవు ఎక్కడుంటావు. ఈ ప్లాన్‌లో నీ పాత్ర !''

"నేను ఇక్కడే ఉంటాను. మీరు ఇలాగే అప్పుడప్పుడు వచ్చి వెళ్తూ వుండండి. మీకు కష్టం కలక్కుండా నా మూడు ప్రక్రియల నడుమకాలం వెళ్ళబుచ్చుతాను. ఈ విధంగా మీ వాళ్ళ సమస్యలు తీరతాయి – మా వాళ్ళ బాధ్యత ఒదిలిపోతుంది...''

"మరి నేను ... చెప్ప ... అమలా ... నేను'' అన్నాడు రౌద్రంతో.

"ఇంతకన్నా మీకు నేను ఏ విధంగాను సహాయం చేయలేను. మిమ్మల్ని బంధించి ఉంచటం నా కిష్టం లేదు.''

మాధవ్ కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసు కున్నాడు. ఆలోచించాడు.

ఈ మార్గం కాస్త బాగున్నట్లు తోచింది.

ఆతడి హృదయం ప్రశాంతమైంది. పావుగంట ఎవ్వరు మాట్లాడలేదు.

(ఇంకా వుంది)

# పెద్ద కథ

# త్రాణికని స్వప్నం

## కోమలాదేవి

మాధవ్ కళ్ళు తెరిచి చూసేటప్పటికి అమల గులాబి మొక్కల్లో వాడిన పూవులను కత్తిరించి పారేస్తోంది

"అమలా ఇక వెళ్తాను."

"అలాగే. . రండి" అంది – తను దారితీస్తూ.

తోటలోంచి బైటికి తీసుకెళ్ళింది. వారిద్దర్నీ చూచి డ్రైవర్ కార్ తీసుకొచ్చాడు.

అంతలో ఆమెకు జ్ఞాపకం వచ్చింది "ఒకసారి లోపలికి రండి" అంది లోపలికి వెళ్తూ.

మాధవ్ ఆమెతో వెళ్ళాడు ఆమె లోపలికి వెళ్ళి ఒక చిన్న పేకెట్ తెచ్చి ఇచ్చింది. "డబ్బు"

"ఓ మర్చేపోయాను.. ఐదు వేలు చాలు .. మీరే అకౌంట్ రాయండి" అని ఐదు వేలు లెక్కబెట్టి తీశాడు

మాధవ్ డబ్బును పాకెట్‌లో భద్రం చేసుకుని ఆమెకు చెప్పి కార్లో కూర్చున్నాడు.

కారు విద్యుద్దీప తోరణాలను దాటుకుంటూ మెత్తగా సాగిపోయింది.

మెత్తగా ఒత్తుగా ఉన్న కుషన్లు – పాకెట్‌లో ఐదువేల రూపాయలు . అమల ఆఖరున సూచించిన మార్గం ఆతడి హృదయాన్ని పూవులా తేలిపో చేసింది ఇంత సులభంగా ఈ సమస్య పరిష్కార మౌతుందని తను ఏనాడు అనుకోలేదు. అమలకు మనసులోనే థాంక్స్ చెప్పుకున్నాడు.

డ్రైవర్ అడిగాడు "సార్ పెళ్ళెప్పుడు ?" ఆతడి గొంతుకలోని ఆత్రాన్ని గుర్తించి "ఏం – నీకు తొందరగా ఉంది ?" అన్నాడు.

"ఔన్సార్. . మా అమ్మాయి పెళ్ళికూడ అమలమ్మగారి పెళ్ళితోపాటు జరిపిస్తారు. ఖర్చంతా అయ్యగారిదే. అందుకే" అన్నాడు డ్రైవర్.

"ఓ.. " అని నవ్వుకున్నాడు

మాధవ్‌కు నవ్వు వచ్చింది... "పెళ్ళి ఖర్చు ఏముంటుంది ?" అని కాస్త ముందుకు వంగి ఆతడి చెవిలో ఏదో ఊదాడు... డ్రైవర్ చటుక్కున బ్రేక్ వేశాడు

"సార్. . నిజమా ? .. ఒద్దుసార్" అన్నాడు వేడికోలుగ.

"ఫరవాలేదు. ముందర చూడు... పోనియ్."

డ్రైవర్ విధిలేక కార్‌ను పోనిచ్చాడు. ఆమెకు మాట ఇచ్చినట్లు తీవ్రంగా ఆలోచిస్తూ ఇల్లు జేరాడు.

(గత సంచిక తరువాయి)

మరుసటిరోజు ఉదయానికిగాని తండ్రితో ఏకాంతంగా మాట్లాడటానికి సమయం చిక్కింది కాదు. మాధవ్ ముఖంలో చాలరోజులుగా కనబడని ప్రశాంతత ఈనాడు పునఃకానవస్తోంది తల్లి దండ్రులు దాన్ని శుభసూచకంగా భావించారు చిన్నవాళ్ళు కాలేజీలకు వెళ్ళిపోయారు మాధవ్ తండ్రి దగ్గర కూర్చున్నాడు. జేబులోంచి ఐదువేలు తీసి లెక్కబెడ్తూ అన్నాడు "రవీంద్రకు ఇస్తామని ఒప్పుకున్న డబ్బు తెచ్చాను. ఆతడికి ఇచ్చి ముహూర్తం పెట్టించుకుని రండి. ఇప్పటికే ఆలస్యమైపోయింది "

గోపాల్రావు విస్తుపోయి చూస్తున్నాడు.

"నీకు ఈ డబ్బు ఎక్కడినుండి వచ్చింది ?" గంభీరంగా అడిగాడు

"మీరు ఇలాగే ఆలస్యం చేస్తే ఆ సంబంధం కూడ దాటిపోతుందని తెచ్చాను" మాధవ్ భయం భయంగా నాన్చుతూ మాట్లాడలేదు.

"ఎక్కడినుండి తెచ్చావ్ ?"

"ఎక్కడి నుండి తెస్తాను. ఇస్తామన్నవారి నుండి. రాజేంద్రప్రసాద్‌గారిచ్చారు" అదెంతో మామూలు విషయంలా అన్నాడు.

"నువ్వు ఇంతనే తీసుకున్నావా ?" గాభరాగా అడిగాడు.

"ఔను. ప్రస్తుతం మనకు కావలసింది ఐదువేలు" అన్నాడు దృఢంగా. "ఇంటి రిపేర్ కోసం ఇరవైవేలు రెడీగా ఉంచమన్నాను సాయంత్రం బేల్‌దార్‌నుగాని మేస్త్రీనిగాని పిల్చుకుని వస్తాను అంచనా వేస్తాడు."

తండ్రి ముఖంలో మారుతున్న రంగుల్ని చూచి మాధవ్ ముఖం చిట్లించాడు. "నాన్నా అట్లా చూస్తారేం ?"

"నువ్వు ఈ విషయాల్లో జోక్యం కల్గించుకో నన్నావు ఏమైనా చేసుకోండి – పొండి అన్నావు ఇట్లా ఉన్నట్లుండి ఈ విధమైన శ్రద్ధ చూపు తుంటే ఆశ్చర్యంగా ఉంది."

"ఓ .. అదా" అని – అతి తేలికగా నవ్వేశాడు

"మా ఫ్రెండ్స్ అంతా ఒకటే గోల – ఎంత తీసుకుంటున్నావ్ – అని. తెలిదంటె నమ్మలేదు. నన్ను పిచ్చివాడిక్రింద లెక్కగట్టారు. చివరికే మన్నారో తెలుసా ? . " అన్నాడు తండ్రివైపు అదోలా చూస్తూ – ఆ జవాబు ఏమిటో ఊహించి గోపాల్రావు భయపడిపోయాడు.

"ఇంటికి పెద్దవాడవై ఉండి డబ్బు విషయంలో బాధ్యతలు నువ్వు తీసుకోకుండా మీ నాన్నగార్కి ఇచ్చావా ? ఇంతవరకు ఆయన బండివి లాగారు. ఇక నువ్వు లాగు" అన్నారు. వాళు సబబుగా తోచింది. ఈ విధంగా నేనా ఆలోచించకుండా అంతా మీపై రుద్దటం నా అవివేకం. మీకు ఇంకా ఈ రిపేర్ బాధ్యతలు పెళ్ళి బాధ్యతలు అప్పగించటం నా కిష్టంలేదు కొన్ని పంచుకోవాలనుకున్నాను. అంతే "

కొడుకు మాటల్లో ఎంత యదార్థం ఉన్నదో ఆతడి మేధకు అందలేదు ! "ఒద్దు– నేనే చూచు కుంటాను ఇదేమీ బరువైన పనికాదు" అని అనలేదు– ఎందుకంటే తను మొన్నమొన్నటి వరకూ ఈ బాధ్యతల్ని ఒదిలించుకు పారిపోవాలనేవాడు లేమిలో – అప్పుల్లో ఉన్నవాడు అట్లా అనటం సహజమేకదా. ఊరకుంటే ఈ అవకాశం కూడా చేజారిపోతుందని తెచ్చికోలు నవ్వు ఒకటి బిగ్గరగా నవ్వాడు

"నిజమే నువ్వు పంచుకోవాలి. అంతకన్నా నేను కోరేదేం లేదు కాని డబ్బుంటే పని చేయించ టానికి నాకు ని సహాయం అక్కర్లేదు మాధవ్ పనివాళ్ళుంటారు నీ కెందుకీ బాధ్యతలు– ఇప్పటి నుంచి– నాలో శక్తి " మాధవ్ చెప్పనివ్వలేదు

"అలాగేలెండి. మీరే చేయించండి. అన్నీ కొనితెచ్చి పడేయిస్తాను. మరి సాయంత్రం వెళ్దామా– రవీంద్ర ఇంటికి ?"

ఆయన తల అడ్డంగా ఆడించారు "అక్కర్లేదు కట్నం డబ్బు పుట్టడం కష్టంగా ఉందని– కొన్నాళ్ళు ఆగాలనీ, ఆగలేకపోతే వేరే సంబంధం . "

"నాన్నా .. చివరికి మీరుకూడ . ఎప్పుడు రాశారు ?" అన్నాడు. ఆతడి కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి.

"నిన్నరాసి పోస్ట్ చేశాను నీ కెందుకంత కోపం. తండ్రిగా– కుసుమకు ఎలాంటి సంబంధం బావుంటుందో నాకు తెలుసును."

"ఔన్నాన్నా–తండ్రిగా ఎటువంటి సంబంధాలు మీ పిల్లలకు బావుంటాయో మీకు తెలుసును నేను కాదనటంలేదు. కాకపోతే నేను అమ్ముడుపోతున్నది మన కష్టాలు తీరటానికి. అప్పులు తీరడానికి – ఈ సొంత ఇల్లు మీదే– అని చెప్పుకోకల్గటానికి– అంతే గాని దర్జాలకు సరదాలకు– గొప్పలకు కాదు మీరు ఊ అంటే ఇప్పుడేవెళ్దాం. ఇంకా మీకు నా మాటలు నచ్చకపోతే– సరే ఉత్తరం చేరి ఉండదు. డబ్బు పట్టుకుపోతే. "

"ఒద్దు ." అన్నాడాయన.

తండ్రి ఇంకా ఏదో అనకముందే– "సరే...నీ ఇష్టం" అంటూ డబ్బు జేబులో పెట్టుకుని లేచాడు. అమల చెప్పినట్లు చేయటానికి ఆదిలోనే హంసపాదమైందని బాధపడ్డాడు.

కాని తను పంతాలకుపోయి తను వేసిన ప్లాను చేతులారా పాడుచేసుకోకూడదు.

తనకు టైం కావాలి. మామూలు వాతావరణం కావాలి. కుసుమ పెళ్ళి విషయం ఏమీ జరగనట్లే రెండు రోజులు వ్యవహరించాడు. మరుసటి రోజు

ఆదివారం తండ్రితో ఏం మాట్లాడాలో నిర్ణయించుకున్నాడు.

మొదట ఇల్లు విడిపించాలి.

మరుసటి రోజు భోజనానంతరం తండ్రిని అడిగాడు తాకట్టు విడిపించటానికి ఎంత కావాలని— ''బ్యాంక్ వాళ్ళనడిగి తెలుసుకున్నారా ?''

''ఆ. ఆమధ్య వెళ్ళి కనుక్కున్నాను ముప్ఫై ఒక్కవేల చిల్లర అయింది.''

''బాపురే'' అని సన్నగా విజిల్ వేశాడు మాధవ్.

''సాయంత్రం వెళ్ళి తెస్తాను రేపే వెళ్ళి కట్టేసి మన పత్రాలు తెచ్చుకుందాం'' అన్నాడు హుషారుగా.

''ఇద్దరం వెళ్దాం మర్యాదగా ఉంటుంది ''

''డబ్బు తీసుకువేవాళ్ళం — మనకేం మర్యాద నాన్నా ఆయన ఆరాలు తీసేరకం— మీరు మెల్ల మెల్లగా చెప్పేసేరకం మీరు ఊరుకోండి. నేను తెస్తాను. అంత డబ్బు ఇంటికితేను. ఎంత అయింది మొత్తం పైసలతోసహా అంకె ఇవ్వండి. చెక్ రాయించుకుని తెస్తాను ''

విధిలేక ఆయన అంకె చెప్పాడు

మాధవ్ బ్యాంక్ వివరాలు — అంకె రాసుకుని కాగితాన్ని భద్రంగా జేబులో పెట్టుకున్నాడు

గోపాలరావుకు బాధగా ఉంది, తను ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు— వీడు ఇలా మారపోయాడేమిటి ? వాడి స్నేహితులంతా అంతే— డబ్బు గలవారు— కాదు కట్నాలు గుంజుకుని దర్జాగా ఉన్న వాళ్ళు

కాని మరుసటి రోజు తన చేతికి తన తాతలనాటి ఇంటి పత్రాలు రాగానే అతడి కళ్ళు చెమ్మగిల్లాయి ఆ క్షణంలో కొడుకుమీద కోపం పోయింది ఏం చేస్తాడో అన్న అనుమానం పటాపంచలైంది

మరో మాట కూడా తండ్రి చెవిన వేశాడు. ''నాన్నా రాజుకు ఇవ్వవలసిన డబ్బు ఇచ్చేశాను అతడి బాకీ కూడా తీరిపోయింది ''

''మంచిదే'' అన్నాడు పొడి పొడిగా

తండ్రి అలా ఉదాసీనంగా ఉండటం అతడికి నచ్చలేదు ''ఏం నాన్నా— అలా ఉన్నారు ?''

''ఈ పత్రం . చేతికొస్తే . అన్నాడు అర్ధంగా.

''ఓ. అదా ఔను . అలాగే ఉంటుంది లెండి'' అన్నాడు సర్దిచెబుతున్నట్లు కారణం అది కాదని మాధవ్‌కు తెలుసు ఇద్దరు బైటికొచ్చారు

అప్పుడు అడిగాడు మాధవ్ ''అమ్మ గొలుసు కూడ విడిపిద్దాం నాన్నా ''

''పద ఆ పై వీధిలోనే ఉంది సేట్ దుకాణం ''


సేట్ లెక్కగట్టినదాన్ని వీళ్ళు అర్థం చేసుకుని డబ్బు కట్టి గొలుసు తీసుకుని దాన్ని పరీక్ష చేయించి తూకం వేయించి అంతా సరిగా ఉందని నిర్ధారణ చేసుకుని బైటికొచ్చేసరికి గంట పైగానే అయింది

''డబ్బు అవసరం అలాంటిది నీకు ఆ రోజు డబ్బు కావలసివచ్చి — ఇది పెట్టి తెచ్చాను అప్పుడు ఎనిమిది వందలిచ్చాడు రెండంతలు కట్టి తెచ్చుకుంటున్నాము ''

గొలుసు విడిపించిన ఆనందం ఆ ఒక్క మాటలో తుడిచిపెట్టుకుపోయింది 'ఆరోజు నీకోసం!'

మాధవ్ ఇంకేం మాట్లాడలేదు ''ఈ అప్పులన్నీ తనకోసమేనా ?''

గొలుసు పత్రాలతో తండ్రిని ఆటో ఎక్కించి



# కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతి కించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥

## తొణకని స్వప్నం

కొంత చిల్లర అతడి చేతిలో ఉంచి మాధవ్ వెళ్ళిపోయాడు

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళి తల్లి మెడలో ఆ గొలుసు చూచి ఆనందించాలి అనుకున్నాడు

కాని తల్లి కాఫీ అందిస్తోంటే అదే జిడ్డు ఓడుతున్న త్రాడు కనబడింది "అమ్మా గొలుసేది?" అని ఆత్రంగా అడిగాడు

"కుసుమ మెడలో ఉంది "

"ఈ జిడ్డు ఓడుతున్న త్రాడు బాగు లేదమ్మా," అన్నాడు

"ఔను పోనీ క్రొత్తది చేయించరాదా మాధవ్" అంది

మాధవ్ చకితుడయ్యాడు

వీళ్ళంతా ఎందుకిట్లా మారిపోయారు?

తను యాచకుడైపోయాడు — ఎవరికోసం?

తను అమ్ముడుపోయాడు — ఎవరికోసం?

తను ఆదుక్కునిరావాలి — వీళ్ళ సరదాలు తీర్చాలి — దర్జాగా ఉండటానికి డబ్బు ఇవ్వాలి .

మాధవ్ బైటికెళ్ళిపొయ్యాడు

అతడికి పదే పదే ఒక విషయం గుర్తుకు వస్తోంది.

కొందరు తల్లిదండ్రులు డబ్బుకోసం ఆడపిల్లల్ని పడుపు వృత్తిలోకి దింపి వారిద్వారా తమ అవసరాలు తీర్చుకుంటారు అలాంటివారు కూడా ఉంటారా అనిపిస్తుంది. కాని తన పరిస్థితి మాత్రం ఏం మెరుగు? తనను ఎరచూపి డబ్బు తీసుకుని వారి సరదాలు, అవసరాలు తీర్చుకోవాలనుకుంటున్నారు. ఇంకా వీళ్ళ కోరికలు ఎలా ఉంటాయో?

రాత్రి భోజనానంతరం కేశవ్ సరదాగా అన్నాడు "అన్నయ్యా అప్పులన్నీ తీర్చేశావటగా? నాకొక స్కూటర్ కొనిపెట్టు."

"స్కూటర్ నీ కిప్పుడనవసరం చక్కగా చదువుకో. మంచి ఉద్యోగం అయితే నువ్వే కొనుక్కోవచ్చును" అన్నాడు సీరియస్‌గా. అన్న నుంచి అటువంటి జవాబు ఆశించని కేశవ్ కనుబొమలు ముడివడినై.

ఆ తరువాత మరెవ్వరు మాట్లాడలేదు.

మరుసటిరోజు ఇంటి మరమ్మత్తు పని ప్రారంభమైంది. రాజేంద్రప్రసాద్ పలుకుబడితో సిమెంట్ బస్తాలు దొరికినై. మరమ్మత్తు చేసి ఆ ఇంటిని ఒక రూపానికి తేవటానికి పదిరోజులు పట్టాయి. సున్నాల పని మాత్రం మిగిలిపోయింది. సిమెంటు ఆరాలన్నాడు మేస్త్రి.

మాధవ్ అంచనా సరిగానే వేశాడు, ఇరవై వేలకు కాస్త తక్కువ అయింది.

గోపాలరావు పైపైకి అతిశ్రద్ధగా సూపర్‌వైజ్ చేస్తున్నలా ఉన్నా అంతరాంతరంలో అతనిలో బాధగా ఉంది. కొడుకు తనను కట్టిపడేశాడు. రాజేంద్రప్రసాద్‌ను కలుసుకోవద్దని — డబ్బు తీసుకోవద్దని చెప్పేశాడు తన చేతిలో పెట్టుకుని రిపేర్ చేయించటంలో అతడి ఉద్దేశం ఇనిపెట్టేశాడు. అందంగా ఉన్న కొడుకును ముందరపెట్టి బాగా డబ్బు గుంజాలనుకున్నాడు. మాధవ్‌ను అమాయకుణ్ణిచేసి — మిగతా ముగ్గురు పిల్లల్ని బాగా పైకి తేవాలనుకున్నాడు కాని తన ఆశలన్నీ అడియాశలైపోయాయి

ఆ సాయంత్రం ఇల్లంతా ఓ మారు తనిఖీచేసి ఎంతో సంతోషంతో అన్నాడు "సున్నం కొట్టిన తరువాత చాల చక్కగా ఉంటుంది నాన్నా పాత కాలం ఇల్లు కాబట్టి గదులు విశాలంగా ఉన్నాయి చూరు ఎత్తుగా ఉంది కిటికీలే చిన్నవిగా ఉన్నాయి"

"ఔను ఆ ప్రక్క మీకోసం గదులు కట్టించాలనుకున్నాను. అప్పుడు పెద్ద కిటికీలు పెట్టించుకోవచ్చును"

"ఒద్దునాన్నా ఇరుకుగా ఉంటుంది నేను వేరేగా చిన్న ఇల్లు తీసుకుంటాను"

"అద్దెకా?" అన్నాడు ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుంటూ గోపాలరావు

"ప్రస్తుతం అద్దెకే"

"ఐతే వేరుగా వుంటావన్నమాట."

"ఔను. . అంతా కలిసి వుండటం కష్టం ఈ ఇల్లు చాలదు అందరం ఒకచోట వుంటే ఏవో మనస్పర్థలు వస్తుంటాయి" కాఫీ త్రాగటానికి వెళ్ళిపోయాడు

అయిపోయింది. తను అనుకున్నంత అయింది.

ఈ వారం రోజుల్లో మాధవ్ చిన్న చిన్న అప్పులు కూడ తీర్చేశాడు ఇంట్లో అత్యావసర వస్తువులన్నీ కొన్నాడు అతడి బాధ్యతలన్నీ అయిపోయినై ఇక అందరినీ ఒదిలించుకుంటాడు అంతే.

కాఫీ త్రాగి బైటకెళ్ళిపోయాడు

"మాధవ్ మారిపోయాడండీ" అంది తల్లి భర్తతో

"ఔను దీన్ని మోసం అంటారు. స్వార్థంతో మనం మన ఉన్నతిని గూర్చి ఆలోచించుకున్నాం. అతణ్ణి అతడి భార్యను అలా దూరంగా ఉంచేయో లనుకున్నాం."

ఆమె ఖండించింది "అట్లా అని మనం అనుకోలేదు" అని. అతడు చిత్రంగా నవ్వాడు "ఇష్టంలేని పెళ్ళాంతో ఏం సంసారం చేస్తాడు! భార్యను నిర్లక్ష్యం చేస్తాడు మన మాట వింటూ మన పాటకు తాళం వేస్తాడు, మనచేతిలో డబ్బంతా ఉంటుంది. అతడికి ఏదీ పట్టకుండా స్వేచ్ఛగా

## సీసపుగాజు!

అణుధార్మిక శక్తి నుండి రక్షణ కల్పించగల కొత్త సీసపుగాజును పశ్చిమ జర్మనీలో తయారుచేశారు దీనిలో 65 శాతం వరకు సీసపు ఆక్సైడు ఉంటుంది చూడటానికి ఇది మామూలు గాజు వలె పారదర్శకంగా ఉంటుంది దీనిని, విమానాశ్రయాల్లో లగేజిని తనిఖీ చేసే ఎక్స్‌రే పరికరాల్లో ఉపయోగిస్తున్నారు ప్రస్తుతం వైద్య, ఇంజనీరింగ్ శాఖల్లోనూ, పరిశోధనల్లోనూ అణుధార్మిక శక్తి విరివిగా ఉపయోగిస్తున్నారు ఈ సీసపుగాజు పనిలో ఉద్యోగులకు, శాస్త్రవేత్తలకు పూర్తి రక్షణ కల్పించగలదని భావిస్తున్నారు

ఉండేలా చేయాలనుకున్నాము ఇదంతా పైకి మనం అనుకోలేదు. కాని భార్య అనామకురాల్లా పడి ఉంటే ఆమెపై ద్వేషం పెంచుకుంటూ మన చెప్పుచేతల్లో ఉండకపోతాడా అనుకున్నాం కాని అతడికి స్నేహితులు బాగానే నూరిపోశారు .. నాకు ఒక్కటే దిగులు పట్టుకున్నది కుసుమకు సుమారైన సంబంధం తేవటం ఎట్లా అని ''

''అంతగా అయితే ఇల్లు అమ్మేద్దాం ''

అతడు పెదిమలు విరిచి తల ఆడించాడు ''అమ్మటానికి వీల్లేదు అమ్మితే ఎక్కడ ఉందాం అనుకుంటున్నావు ?''

''చిన్న ఇల్లు అద్దెకు తీసుకుందాం ''

''మంచి సలహాయే కాని ఇది నేను కట్టించిన ఇల్లు కాదు. నీకు ఒక విషయం చెప్పటానికి మర్చిపోయాను ఈ ఇల్లు నా పేరునలేదు తాతగారు పోయేటప్పుడే వీళ్ళిద్దరి పేరున పెట్టారు మా నాన్న చిన్నవయసులో పోవటం — నాది చిన్న ఉద్యోగం అని ఈ పని చేశారు అమ్మే ఆలోచన లేకుండా జేశారు''

ఆమె గ్రుడ్లప్పగించి చూస్తోంది

''చెల్లి పెళ్ళికోసం ఒక పాతికవేలు ఇవ్వలేడా?''

''ఇవ్వడు వాడికి ఉన్నట్లుండి ఎక్కడలేని తెలివి పుట్టుకొచ్చింది. రవీంద్ర సంబంధాన్ని వద్దన్నామని కోపం బైటికనడు.''

''కట్నం డబ్బు అందుకున్నప్పుడు .. ''

అతడు ''పిచ్చి'' అని బిగ్గరగా నవ్వాడు. ''తనే తీసుకుంటాడట నన్ను ఆయన దగ్గరకెళ్ళనే వద్దన్నాడు.''

ఆమె అవాక్కయి నోరు వెళ్ళబెట్టుకుంది

''వాళ్ళే దాచేశారు వాడిని తమవైపుకు తిప్పుకున్నారు డబ్బు ఎగేస్తారేమో ''

''నిస్సందేహంగా.''

ఇరువురు చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. ఎవరి ఆలోచలు వారివి. కాని ఒకందుకు ఆనందించారు. ''అప్పులన్నీ తీర్చాడు. ఈ ఇంట్లో నిశ్చింతగా ఉండొచ్చు .''

* * *

మాధవ్ అమల దగ్గరకు వెళ్ళి పక్షంరోజులైంది ఆ రోజు అమల తలిదండ్రులు — అమల మాట్లాడుకున్నారు

''మాధవ్ మోసం చేస్తాడా తల్లీ! మొత్తం ఎంతైంది ?''

''డెబ్భైకి దగ్గర'' అంది అమల.

ఆయన ఆలోచిస్తూ తల పంకించారు

''నీకేమనిపిస్తోంది అతడు మోసం చేశాడంటే ఈ డెభ్బైవేల కోసం దేవుళ్ళాడటం అవమానకరం. నిన్న ఫోన్ చేసి చెప్పాడు. చిన్న ఇంటికోసం ప్రయత్నిస్తున్నాడట'' రాజేంద్రప్రసాద్ అన్నాడు

తల్లి అంది ''కొంటానికా ?''

''కాదు అద్దెకు ''

అమల లోలోపల ఆనందించింది. తను చెప్పినట్లు చేస్తున్నాడు. అసలు విషయం తలిదండ్రులకు తెలియదు పెళ్ళియ్యాక తెలుస్తుంది అప్పుడు ఒద్దు అనలేరు

''ఇక ఆలస్యం దేనికి . త్వరగా చేసేద్దాం'' అంది తల్లి.

''ఔను రేపు రమ్మని ఫోన్ చేస్తాను.''

ముగ్గురు ఫోంచేసి అవతలికి వచ్చారు లక్ష్మి హడావిడిగా వచ్చింది — ''బాబుగారు వచ్చారమ్మా''

అది చెప్పేతీరులో తెలుసుకున్నారు. బాబుగారు — అనటం — అమలకే చెప్పటం. అప్రయత్నంగా వాల్‌క్లాక్ కేసి చూశారు ఎనిమిదిన్నర

ముగ్గురు ముందరి గదిలోకి వచ్చారు. అతడి నమస్కారాన్ని అందుకుంటూ ''కూర్చో ..కూర్చో . నూరేళ్ళు ''

''పత్తాలేడనుకున్నారా ?'' ఓరగా అమలవైపు చూచాడు.

పెద్దవాళ్ళిద్దరు వెకిలిగా — తేలికగా నవ్వేశారు

అమల తల వంచుకున్నది మాధవ్ ముఖం గంభీరమైంది

''ఒక విషయం చెప్పటానికి వచ్చాను మీకు షాకింగ్‌గా ఉంటుంది కాని తప్పదు ''

భార్యాభర్తలు పరస్పరం చూచుకున్నారు గంభీరంగా ఉండిపోయారు

అమల తనలో అణువణువున ఉన్న శక్తినంతా కూడదీసుకుని — తన హృదయం అతడు చెప్పే దారుణమైన విషయాన్ని భరించటానికి — కవచాన్ని తయారు చేసుకుంటోంది అతడు చెప్పబోయేది తనకు తెలుసును. అయినా తలిదండ్రులు ఎంతగా బాధపడ్తారో అన్న ఆందోళన ఆమెలో ఉధృతమైంది.

మాధవ్ చటుక్కున లేచి నుంచున్నాడు

''నేను అమలతో ఏకాంతంగ మాట్లాడాలి ''

వాళ్ళిద్దరు అవాక్కయి చూస్తున్నారు

అమల మెల్లగా నుంచుని లోపలికి దారితీసింది

జేబులోంచి ఒక కవరు తీసి మెల్లగా రాజేంద్రప్రసాద్ ఎదుట ఉంచి గబగబ అమలతో లోపలికెళ్ళాడు

''అమలా మీ గదిలోకి వెళ్దాం ''

ఆమె మౌనంగా నడుస్తోంది అడుగు దూరంలో ఆమె వెనకాతలగా నడుస్తున్నాడు చామనచాయకన్నా మెరుగైన ఆమె రంగుకు ముక్కుపొడుం రంగు పాలియెస్టర్ చీర బాగా నప్పింది మెడలో సన్నటి గొలుసు మెరుస్తోంది ఆమె చెవుల్లో రవ్వల దుద్దులున్నాయిగాని — తనకు దాని వెనుక భాగం మరమాత్రం కనబడుతోంది

వెనకాతలగా ఎంతో బావుంది కాని ప్చ్ అనుకున్నాడు

గదిలో అడుగు పెట్టగానే ఆమె లైట్ వేయబోయింది.

''అమలా . అట్లాగే నుంచో నేను చెప్పేది విను నేను వెంటనే నిన్ను రిజిస్టర్ మేరేజి చేసుకోవాలనుకుంటున్నాను . సరేనా ?'' అన్నాడు ఆత్రంగా


అతడి చేతులు ఆమె భుజాలను పట్టుకున్నాయి ఆ మాటలకు— ఆమె ఆశ్చర్యం నుండి తేరుకోకముందరే అతడి స్పర్శ! ఆమె శరీరం బిగిసినట్లు అయింది

''అమలా. . ఊ అను''

ఆమె భూమిని అంటుకున్నట్లు గట్టిగానుంచుని మెల్లగా ''ఊ'' అంది.

అతడు ఆమెను ఒక్క ఊపున తన వైపుకు త్రిప్పుకున్నాడు. ఆమెను హృదయానికి హత్తుకున్నాడు. ఆమె చేతులు అతడి మెడను అల్లుకుపోయాయి అతడి అనురాగ వెల్లువలో ఆమె కరిగిపోయింది.

[ఇంకా వుంది]



పెద్దకథ

# తొణికని స్వప్నం

కోమలాదేవి

(గత సంచిక తరువాయి)

అడుగుల సవ్వడికి ఇరువురు ఎడమయ్యారు. ఆమె ముందుకు వెళ్ళి లైట్ వేసింది.

గదిలోకి ఎవ్వరు రాలేదు.

మాధవ్ కూడ ముందుకు వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. ఆమె దూరంగా ఒక స్టూల్‌మీద కూర్చున్నది.

''నీ మాటలన్నీ తు—చ— తప్పకుండా చేశాను. మరి నువ్వు నా మాట వినాలి.''

''అట్లాగే...'' అంది.

''ఇట్లా వచ్చి కూర్చో. నేను చెప్పేది శ్రద్ధగా విను...''

అమల రాలేదు...

''అమలా...'' అన్నాడు ఎంతో మృదువుగా. ఆ పిలుపులోని అనురాగానికి ఆమె హృదయం పురివిప్పి నాట్యం చేసింది.

''ఊ... ఈ హృదయం ఈ ఆనందాన్ని పట్టలేకపోతోంది.''

''ఔను... నాక్కూడ అలాగే ఉంది...అందుకే త్వరగా రా... విను.''

అమల వచ్చి ఆతడికి దగ్గరగా కూర్చున్నది.

''మీరు నన్ను ప్రేమించగలరని కలలోకూడ అనుకోలేదు. అందుకే షాక్ — ఆ తరువాత తన్మయత్వం.''

''ఔను... నేనుకూడ అనుకోలేదు. కాని బాహ్య సౌందర్యంలో ఏమీ లేదనుకోగానే ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.'' ఆమె చేతిని అందుకుని గట్టిగ పట్టుకున్నాడు.

''నేను చెప్పే విషయాలకు చిన్నబోకు. మా ఆర్థిక ఇబ్బందుల్ని — అప్పులను గూర్చి నువ్వెంత గంభీరంగా మాట్లాడావు? నన్ను అవమానించాలని ప్రయత్నించలేదు. అలాగే నేను మాట్లాడే విషయాన్ని నీ మేథ్స్ బుర్రతో సరైన కోణంలో ఆలోచించాలి. సరేనా ?''

''ఉ'' అంది — ''ఏమిటో అది —'' అన్న ఉత్సుకతతో.

''అమలా... నువ్వు ఇంతవరకు... అందంగా కనబడాలని ప్రయత్నం చేయలేదా ?''

అమల కిలకిల నవ్వింది. ఆమె నవ్వు వినటం అదే ప్రథమం. కల్మషం లేకుండ హాయిగా నవ్విన నవ్వు అది.

''బలే ప్రశ్న ! కనుబొమ క్రిందనుండి పూర్తి చెక్కిలిని కప్పే ఈ మచ్చతో అందంగా ఉండాలని ఎట్లా ప్రయత్నించను ? నవ్వరూ ?'' ఆ మాత్రం తెలీదా ? అన్న ధోరణిలో అంది.

''మచ్చ సంగతి కాదు. రేపు... అంటే రేపే... ఆ డెంటిస్ట్ దగ్గరకు వెళ్ళి ఆ పన్ను సంగతి చూడు.''

''వాడికేం లాగిపారేస్తాడు. మిగిలేది మరో అవకరం — త్రొ(ఱ)'' అమల మళ్ళీ నవ్వింది.

''వాళ్లే... నన్ను ఫూల్ చెయ్యాలనా ? వేరే పన్ను పెట్టేస్తాడు... ఏం ?''

అమల తన మూతిని తలంచుకుంది. అట్లా చేస్తే నవ్వితే ఆ పన్ను కనబడదు. ఊరకున్నప్పుడు మూతి అసహ్యంగా ఉండదు. బాగానే ఉందనుకున్నది.

''సరే'' అంది ఉత్సాహంగా.

''బ్యూటీ పార్లర్‌కు వెళ్ళి నుదుటిని కప్పుతూ పెరిగిన వెంట్రుకల్ని తీయించేసుకో, మామూలుగ అంతా చేయించుకుంటారట... సరేనా ?''

''సరే'' అంది నవ్వుతూ.

''ఇక మూడవది... అమలా నాకోసం నువ్వు భరించాలి... బాధ, వ్యయప్రయాసలతో కూడిన పని... ప్లాస్టిక్ సర్జన్ దగ్గర నీ ముక్కు సరిచేయించుకోవాలి.''

''మీ ముక్కులో సరితూగాలన్న మాట'' రహస్యంగా అన్నలా అంది.

''ఔను మరి'' అన్నాడు.

అమల చేయి ఉన్నట్టుండి శక్తిలేనట్లు 'లింప్' అయిపోయింది.

''ఏమిటి అమలా'' ఆందోళనతో అడిగాడు.

''మీ పిచ్చి... ఇంత చేసినా చూడటానికి బావుండను కదా...'' అంది దిగులుగ.

''ఉండకపోతే ఫరవాలేదు. నాకు బాగానే ఉంటావు... అమాలా... ఒక్కటి చెప్పు... ఇందాక నిన్ను అనురాగంతో— ఆవేశంతో ముద్దు పెట్టుకున్నాను. దానిలో నటన కనబడిందా ? నీ హృదయాన్ని అడిగి చూడు'' అన్నాడు ఆర్తితో.

జవాబుగా అమల చేయి సన్నగా కంపించింది.

''మరి వెళ్లొస్తాను.''

మాధవ్ ఆమె ముఖాన్ని తన రెండుచేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె చెక్కిళ్లపై తడికి ఆతడిచేతులు తడిచిపోయాయి. అదురుతున్న ఆమె అదరాలపై క్షణకాలం తన పెదిమలు నిల్పాడు. ఆ తరువాత తన కుడి చెక్కిలితో ఆమె కుడి చెక్కిలి రాశాడు.

''వస్తాను'' అని బైటకెళ్లిపోయాడు.

మాధవ్ కోసం వాళ్లిద్దరు ఎదురు చూస్తున్నారు.

మాధవ్ వచ్చి వాళ్ల ఎదురుగ కూర్చున్నాడు.

''అమల నడిగాను. ఒప్పుకుంది.''

రాజేంద్రప్రసాద్ కవరు మాధవ్ కిచ్చాడు.

పెళ్లికోసం పెట్టుకున్న అర్జీ అది.

''ఐతే పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు?'' అడుగుతూ—

రాజేంద్రప్రసాద్ బిగ్గరగా నవ్వాడు, ''అమల పెళ్లి ఇట్లా అవుతుందనుకోలేదు. చాలా గ్రాండ్‌గా చెయ్యాలనుకున్నాము. మీ నాన్నగారి కోరిక కూడ అదే.''

''అంత డబ్బు వేస్ట్. దాని అవసరం ఎంతైనా ఉంది. అమల మీకు చెబుతుంది'' అని లేచాడు.

''మరి డబ్బు ఎప్పుడు తీసుకుంటావ్ మాధవ్ ?'' ఆయన కూర్చో అని చేతో సైగ జేస్తూ అడిగాడు. మాధవ్ కూర్చున్నాడు.

''మా నాన్నగారు ఎంత డబ్బు అడిగారు ?'' మాధవ్ తల వంచుకుని మెల్లగా అడిగాడు.

ఆయనకు నవ్వు వచ్చింది. డబ్బు ఎవ్వరికి చేదుకాదు. మాధవ్‌కు కూడా కాదు అనుకున్నాడు.

''మీ నాన్నగార్ని అడగలేదా ?''

''అడగాలనుకున్నాను— కాని ఈ ప్రస్తావన తెచ్చారు కాబట్టి మీరే చెప్పండి.''

''మూడు లక్షలు— కారు.''

మాధవ్ ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకొంటూ నవ్వాడు. హాయిగా నవ్వాడు.

''మీరంతా కలసి నాకు బాగానే విలువ కట్టారు. థాంక్స్...'' ఆతడి ముఖం సీరియస్‌గా ఆయింది.

రాజేంద్రప్రసాద్— అతడి భార్య కొస్త భయంతో చూచారు. కూతురి మెడలో ఆ మూడు ముళ్లు పడేవరకు వీళ్లు వాళ్లు అడిగినదానికి సరే అనాలి— అంతే... ఇంకా ఇవ్వగలరు. కాని ఈ ఆశకు అంతం ఎప్పుడు !

''అమల కోసం చాల ఖర్చు చేయవలసి వస్తుంది'' అంటూ లేచాడు.

''చెప్పు— వింటాను'' అన్నట్లు చూస్తున్నాడు రాజేంద్రప్రసాద్.

''ఇప్పుడు తీసుకున్నది చాలును. ఇక ఏమీవద్దు— కాని ఒకటి చెయ్యాలి మీరు''

ఏమిటన్నట్లు మానుపడి చూస్తున్న అత్తమామగార్ల వైపు చూచి నవ్వాడు.

''పాపం డ్రైవర్ కూతురి పెళ్ళి మాత్రం మామూలుగ జరిపించండి'' అని వెళ్ళిపోయాడు.

మరి కాసేపటికి కారు వెళ్ళిపోతున్న శబ్దం విన వచ్చింది. ఆతడు హఠాత్తుగా వెళ్ళటం — వాళ్ళు ఆశ్చర్యం నుండి తీరుకోవటం అయ్యాక అమల వచ్చి అన్ని సంగతులు చెప్పింది. చాలసేపు మౌనంగా కూర్చున్నారు.

చివరికి తల్లి అంది ''ఆ తండ్రికి చాల షాకింగ్‌గా ఉంటుంది. ఇన్ని లక్షలు అతను ఒద్దు అన్నందుకు, పోనీ కొంత డబ్బు రహస్యంగా ఇద్దామా ?''

అమల ఒద్దన్నట్లు తలాడించింది ''మాధవ్

ఆశయం వేరు. ఈ విషయం తెలిసిందంటే నన్ను ఎన్నటికీ క్షమించరు" అంది దృఢంగా.

"ఐతే... ఒక పని చెయ్యి... వారి అవసరాన్ని కనిపెట్టి న్యాయమని తోచినప్పుడు నీకుగా నీవు వారికి సహాయం చెయ్యి, మాధవ్ నీ చర్యను హర్షిస్తాడు."

అమల లోపలికి వెళ్ళిపోయింది. తన గదిలో అన్ని లైట్లు వెలుగుతున్నాయి.

అనూహ్యమైన ఆనందంతో ఆమె అణువణువు నాట్యం చేస్తోంది.

తండ్రి తల్లి అత్తమామల సమక్షంలో మాధవ్ అమలను పెళ్ళి చేసుకున్నాడు.

ఆ సాయంత్రం అమల — ఆమె తల్లి బొంబాయికి వెళ్ళిపోయారు.

నెల రోజులు అందరికి అవిరామంగ గడిచి పోయింది. ఇంట్లోవారికి మాధవ్ శత్రువైపోయాడు. ఒక్కరు కూడా మనసారా పలుకరించటం లేదు. అరచేతిలో ఉన్న ఆనందాన్ని కర్కశంగా లాగివేసిన క్రూరుడిలా చూస్తోంది కుసుమ. కొడుకు మారి పోయి పెత్తనం తన చేతుల్లోకి తీసుకుని నయా పైసా తనకు ఇవ్వలేదని ఆ తండ్రి బాధ. మాధవ్ డబ్బు తీసుకోలేదని అతడికి తెలియదు. ఆడపిల్లలకు చిన్న బహుమతి కూడ ఇవ్వకుండా పెళ్ళి జరిపేసు కున్నారు.

కాని ఎక్కడో మారుమూల హృదయంలో మాధవ్ అమలను చేసుకున్నందుకు జాలిపడ్డారు. కాని ఆ మూలను విడిచి ఆ భావం బైటికి రాకుండా తలుపులు బిగించివేశారు.

రాజేంద్రప్రసాద్ మాధవ్‌లు ఇల్లు అద్దెకు తీసుకున్నారు. దాన్ని వస్తువులతో అమర్చాలను కున్నారు. కాని మాధవ్ ఒద్దన్నాడు. "అమలకు ఇష్టమైనట్లు అమర్చుకోనివ్వండి. ఏది కావాలో తనే నిర్ణయించుకుంటుంది."

ఆయన ఆ మాటలకు పొంగిపోయాడు.

బొంబాయి నుండి తరచు ఉత్తరాలు వచ్చేవి.

ఏదో ఒకటి తేల్చుకోవాలనుకున్నాడు తండ్రి.

"నీ భార్య రాగానే వేరే వెళ్ళిపోతావు. ఇల్లు కూడ తయారుగ తీసిపెట్టాడు నీ మామ. మరి కుసుమ పెళ్ళి మాట ఏంచేశావు? ఒక్క పది వేలుంటే అయిపోతుంది."

మాధవ్ తండ్రివైపు జాలిగా చూచాడు. నాన్నా "నేను డెబ్భై వేలు తీసుకుని అన్నీ చేశాను. అంత చాలుననుకున్నాను. నేనేం తీసుకోలేదు. ఒద్దన్నాను."


గోపాలరావుకు గుండె ఆగినంత పనైంది.

"లక్షలను వద్దన్నావురా?" గర్జించాడాయన.

కొడుకును 'రా' అని సంవత్సరాలు దాటి పోయాయి. మాధవ్ అతికష్టంతో కోపాన్ని అణచు కున్నాడు. "నాన్నా—నేను ఎంతో మాట్లాడగలను—మిమ్మల్ని ఎన్నో అనరాని మాటలు అనగలను. మీరు నా విషయంలో చేసిన తప్పులన్నీ ఎత్తి చూపగలను. కాని అవన్నీ మీకు తెలుసును. నేను చెప్పక్కర్లేదు. మన ఆర్థిక ఇబ్బందులు తీరాలనుకున్నాం—అందరు సంతోషంగా ఉండి నేను అనామకుడినైపోయినా ఫరవాలేదనుకున్నాను. కాని మన తాహతుకు మించిన కోరికలతో నన్ను ... చులకనచేసి బేరం పెట్టి






అమ్మారు. నా అందాన్ని చూపి మూడు లక్షలు అడిగారా! అందమైన ఆడపిల్లను 'అందు' కోసం అమ్మే తలిదండ్రులు నయం. నేను అంగీకరించానని, డబ్బు విషయంలో జోక్యం కల్గించుకోలేదని మీరు అత్యాశకు పోయారు. నాకు జ్ఞానోదయం కాక పోయినట్లయితే నేనెంత అధోగతి పాలై ఉందునో! నేను నా భార్య పూచికపుల్లల్లా పడి ఉండేవాళ్ళం. నేను, డెభ్భై వేలు కట్నం తీసుకున్నాననుకోండి. తృప్తిగా ఉంటుంది."

మాధవ్ అక్కడనుండి వెళ్ళిపోటానికి లేచాడు.

"వాణ్ణి చదివించటానికి డబ్బు?" విసిరినట్లు మాటలు ఊడిపడ్డాయి తండ్రి నోటినుండి.

"ఇంకా చదివించటం ఏమిటి నాన్నా! బి.కాం. ఫైనల్ పై నెలలో రాస్తున్నాడుగా. వెంటనే ఉద్యోగ ప్రయత్నం చేస్తేసరి."

"వాడు ఎం. కాం. చదవాలనుకుంటున్నాడు."

"చదవమనండి. దానికేం?"

"మరి డబ్బు?"

"డబ్బుకేం తక్కువ? వాడికికూడ మరో అమల లాంటి పిల్లను తెచ్చి చేస్తే పోతుంది. ఎం. కాం. స్కూటర్ కాదు — పి. ఎచ్. డి. కారు కూడ వస్తాయి. మీరు అందరికీ ఇలాంటి ఆశలు కల్పిస్తారని నేను కల్లోకూడ అనుకోలేదు.

"మరి సుమలత!"

మాధవ్ తల పట్టుకుని కూర్చున్నాడు. "నేను ఎక్కడికో పరాయి దూర దేశానికి వెళ్తున్నట్లు మాట్లాడుతున్నారెందుకు? నేను ఇక్కడే ఉంటాను. మిమ్మల్ని ఒదిలి పారిపోయేటంత కఠినుడ్ని కాను... కాకపోతే మీరంతా నామీద కత్తికట్టినట్లు వ్యవహరిస్తుంటే బాధపడుతున్నాను..."

గోపాలావు మరి మాట్లాడలేదు.

"లంచం బెట్టి ఉద్యోగం తెప్పించేద్దాం. దాని అప్పు తీర్చుకుంటాడు." అని వెళ్ళిపోయాడు.

ఎంత సర్దిచెప్పుకున్నా అతడికి మాధవ్ నేరస్థుడిలాగానే కనిపించాడు. వాడిదే తప్పు. మొదట తనకు స్వేచ్ఛఇచ్చాడు. అందుకే తన ఆశకు అంతం లేకుండాపోయింది. ఆనాడే ఆరాలుతీసి ఉంటే తను ఇన్ని కోర్కెలతో సతమతమవకపోయేవాడుకాదు. కాని, ముందునుండి అతడు ఒకే కోణంలో ఆలోచించాడు—

## తొణకని స్వప్నం

మాధవ్‌ను అన్నింటికి దూరంగా ఉంచాలనే ఆతడి అభిమతం. కాని... కథ అడ్డం తిరిగింది.

ఆ రాత్రి సుమలత అన్నను దెప్పిపొడిచింది.

"మహా వైభవంగా పెళ్ళి చేస్తానని మాట ఇచ్చాడట మీ మామ. పెళ్ళిలో పెళ్ళికొడుకు చెల్లెండ్రలా సరదాగా దర్జాగా తిరగటానికికూడ వీల్లేకుండా చేశావు."

చెల్లివైపు రెప్పవాల్చకుండా చూచాడు. ఆ తరువాత మెల్లగా అన్నాడు "ఏ అవకరం లేని వాళ్ళతో, ఐశ్వర్యవంతులతో ఆ పెళ్లి ఇల్లు సందడిస్తుంది. వాళ్ళంతా పైకి ఏమీ అనకపోయినా మనసులో— చాటుగా అనుకుంటారు... వాళ్ళ విమర్శించని విషయం ఒక్కటి ఉండదు. ముఖ్యంగా ఎవరివల్ల మనకీ సమస్యలు తీరాయో— ఆ విశాల ఉన్నత హృదయం గాయపడకూడదనే నేను ఇట్లా పెళ్లిచేసుకున్నాను. అమల వచ్చిన తరువాత మీకు తప్పక బహుమతులు తెస్తుంది" ఆ తరువాత ఇంకేం మాట్లాడటానికి ఎవ్వరు సాహసించలేదు.

ఆ రోజు మాధవ్ అత్యంత ఉత్సాహంగా ఇంటి కొచ్చాడు. సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుని తలి

### తాగుడు అనర్థం!

తాగుడు, నిద్రమాత్రల వలన కాలేయం చెడిపోయి కామెర్ల వ్యాధి రాగలదని పశ్చిమ జర్మనీ వైద్యులు హెచ్చరించారు. నిద్ర మాత్రలలోని వివిధ రసాయనాలను విభజించ టానికి వీలు లేకపోవడం వలన పచ్చకామెర్లకు దారి తీస్తుంది. రోజుకు 0.7 లీటర్ల సారాయి, 2 లీటర్ల బీరు చొప్పున రెండు సంవత్సరాలు తీసుకుంటే కాలేయం పాడై పోవడం తథ్యమని వీరు హెచ్చరించారు. ఆ తరువాత కూడా దీనిని కొనసాగనిస్తే, మరో రెండు లేక మూడు సంవత్సరాలలో మృత్యువు తప్పదని కూడ వీరు హెచ్చరించారు. ఏ దశలోనైనా తాగుడు మానితే, కాలేయం సర్దుకుని ఆరోగ్యం బాగు పడేందుకు అవకాశమున్నదని వీరు తెలియచేశారు.

దండ్రులకు చెప్పాడు. "పది రోజులు సెలవు పెట్టాను. అమలను బొంబాయినుండి తీసుకుని రావాలి."

కొడుకు అంత ఆత్రంగా ఆనందంగా పరుగులు పెట్టటం వాళ్ళకు బాధకరంగా ఉన్నా "వెళ్లిరా" అని హృదయపూర్వకంగా అన్నట్లు నటించారు.

కొడుకును గుమ్మం దాటనిచ్చి... "ఇది నాకు అర్థం కావటంలేదు. ఆ పిల్ల అంటే మాధవ్‌కు అంత ఇష్టం— ప్రేమ ఎలా పుట్టుకొచ్చాయో!" అంది తల్లి.

ఆయన అపహాస్యం చేస్తున్నట్లు నవ్వాడు "అందుకే ప్రేమ గ్రుడ్డిదన్నారు" అన్నాడు.

హోటల్ గదిలో అమల డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని తన ప్రతిబింబాన్ని చూచు కుంటోంది. టేబుల్‌మీద మాధవ్ వస్తున్నట్లు పంపిన టెలిగ్రాం ఉంది. ఆమె ఆనందం పరి పూర్ణత చెంది ఉంది.

"ఈ ఆలోచన మనకు ముందరే ఎందుకు రాలేదో!" అంది తల్లి, ప్లాస్టిక్ సర్జరీని తలంచుకుని.

"నాకు వచ్చింది... కాని... ఎంత చేసుకున్నా ఫలితం అంతే అన్న నిస్పృహ ఉండేది."

అమల నవ్వింది. పలువరస ముత్యాల్లా మెరవక పోయినా వరుసగా ఉండి చూడటానికి అసహ్యంగా లేదు. నుదురు తడుముకున్నది... పాలభాగంలో అనవసరమైన నూగులేదు— విశాలంగా ఉంది. ఎర్రటి బొట్టు దివ్యంగా మెరుస్తోంది.

ఆమె ముక్కుని మునివేళ్ళతో సవరించుకుంది. పొట్టిగా ఉండి పరచుకున్నట్లున్న ముక్కు ఎత్తుగా తిన్నగా ఉంది! మాధవ్ ముక్కుతో పోటీపడి నిలువ లేదు. చూడటానికి సంపంగి మొగ్గలా లేకపోయినా మామూలుగా బాగానే ఉంది. ప్రక్కకు తిరిగింది — రవ్వపుడక తళుక్కుమంది.

అప్రయత్నంగా ఆమె చేయి చెక్కిలిని తడుము కున్నది... మచ్చ అట్లాగే ఉంది. దాన్ని కూడా ప్లాస్టిక్ సర్జరీతో, చర్మము అంటించి చికిత్స చేయ వచ్చు. దానికి సమయం కావాలి... తను ఆగలేదు... మాధవ్‌ను చూడాలి. తామిరువురు భార్యా భర్తల్లా కొన్నాళ్ళుండాలి. ఈ మచ్చ ఉన్నప్పుడే ఆతడి ప్రేమ ఉన్నత శిఖరాన్ని అందుకుంటే ఆ అనుభవం చాలు... తన అణువు అణువు మాధవ్ పేరు ఉచ్చరిస్తోంది.

ఆమె తనువు మనసును మాధవ్ ఆక్రమించుకుని ఉన్నాడు.

అంధకారంలో ముళ్ళలో నడిచిన ఆమె పూల బాటలో స్వచ్ఛమైన వెలుగులో పయనించబోతోంది.

భర్త రాకకోసం ఆమె వేయి కళ్ళతో ఎదురు చూస్తోంది. రాజేంద్రప్రసాద్ స్వయంగా వెళ్ళి అల్లుణ్ణి ప్లేన్ ఎక్కించి వచ్చాడు. ఒక అల్లుణ్ణి — ఎవరైనా సరే తెచ్చుకోవాలనుకున్నారు. కాని మాధవ్ లాంటి మంచి మనసున్న అందమైన యువకుడు అమలకు దొరుకుతాడని ఆయన కలలో కూడ అనుకోలేదు.

గగనంలో ఎగురుతున్నవిమానం వైపు చూచి తృప్తిగా హృదయం నిండుగా ఆనందాన్ని నింపుకున్నాడు.

మేఘమాలికల పరుపు పైన తేలిపోతోంది విమానం. వెనక్కి ఆనుకొని కళ్ళు మూసుకున్నాడు. తన స్వప్న సుందరి మనోఫలకంపై రూపు దిద్దుకుంటోంది. నల్లటి మేఘాలను మంచు తెరలనూ తొలగించుకుంటూ స్పష్టమౌతున్న ఆ ఆకారం తన కెంతోసంతృప్తికరంగా ఉంది. ఓ చిన్న మబ్బుతునక ఆమె ముఖం మీద తారట్లాడుతోంది—ఇంకా! ఆమె విశాలమైన ఫాలభాగం మీద ఎర్రని బొట్టు, ముచ్చటైన ముక్కుకున్న చిన్న వజ్రం ముక్కుపుడక తళుకులీనుతుంటే ఆమె పెదిమలపై దరహాస రేఖ నాట్యం చేస్తుంటే శ్రావ్యమైన కంఠం ఎత్తి ఓ మధురమైన ప్రేమ గీతికతను ఆలాపిస్తూ తనను సమీపిస్తోంది...! మాధవ్ హృదయం స్పందించింది. ఆమెను అమాంతంగా పొదివి పట్టుకుని ఆ ముక్కుకు తన ముక్కు రాస్తూ ఎన్నో తీపి తీపి కవనాలు చెబుతున్నాడు. ఆ కబుర్లకు అంతే లేదు !

హోటల్ చేరిన వెంటనే లిఫ్ట్‌లో అమల ఉన్న అంతస్థుకు వెళ్ళాడు.

మెల్లగా తలుపుమీద తట్టాడు.

"ఎవరూ ?" అంటూ అమల వచ్చి తలుపు తీసింది.

మాధవ్ "అమలా" అంటూ ఆనందావేశాలతో ఆమెను తన బాహువుల్లో బంధించాడు.

ఆమె మారిన రూపును తన్మయత్వంలో అవలోకిస్తున్నాడు.

అమల నవ్వింది. "అయినా...బాగాలేనా ..." అంది.

"నో ... నో ..." అంటూ తన ముక్కు ఆమె ముక్కుకు రాశాడు.

"నేనొక కలగన్నాను" అన్నాడు ఆమెను గాఢంగా చుంబించి, కాస్త దూరంగా ఉండేట్లు నిలిపి ఆమె భుజాలమీద చేతులుంచి ఆమె ముక్కుకేసి చూస్తూ.

"మీ డాక్టర్ — ఈ ముక్కుకు అప్పుడే ఒక వజ్రపు తునకను పెట్టేశాడే! నా స్వప్నంలో — నా సుందరికి ఇలాగే ఉన్నది" అన్నాడు చిలిపిగ నవ్వుతూ.

"మీ స్వప్నం తొణక కూడదని అలాచేసి ఉంటాడు ."

"ఔను ... నా స్వప్నం తొణకలేదు. ఒకప్పుడు నా మనఃఫలకంపై ధూళి ఉండి కనిపించినదే యదార్థమైన అందం అనుకున్నాను. సృష్టిలోని అందాన్ని గ్రహించటానికి మంచి మనసు, హృదయ పూర్వకమైన త్యాగశీలత, నిస్స్వార్థమైన తలపులు ముఖ్యమని నాకు నేర్పావు. నా మనోచక్షువులు హృదయ సౌందర్యాన్ని గ్రహించలేకపోయాయి. నా జీవితంలో వసంతమే లేదనుకున్న నాకు రాగ రంజిత వసంతమే నా హృదయంలో నిల్చిపోయేలా చేశావు. బాధ్యతల నుండి పారిపోయి జీవితాంతం—నేను త్యాగం చేశాను — అని గొప్పగా అనుకుంటూ — కుమిలి పోతూ మన ఇరువురి జీవితాల్ని అంధకారం చేయాలనుకున్న నన్ను వెలుగుబాటలోకి నడిపించావు మరబొమ్మలా ఉన్న నన్ను మానవుడిగా ఆలోచింప జేశావు ... అందుకే అమలా మనకు చాల బాధ్యతలున్నాయి. ఈనాటి నుండి నా జీవితంలో ప్రవేశించి నా కష్టాలలో — నా సమస్యలలో—నా బాధ్యతల్లో— నా ఆనందంలో ... "

ఆమె చటుక్కున అంది "అర్ధాంగిగా ఉంటాను"

"ఊ"నని తల ఊపుతూ పారవశ్యంతో సంతృప్తిగా ఆమెను తన హృదయంలోకి తీసుకున్నాడు.

"అమలా సరైన భాగస్వామి దొరకలేదని బాధ పడ్డాను. ఆనందానురాగాలకు నిలయమై వివాహం అనేది విజయవంతం కావాలంటే సరైన భాగస్వామిని వెదుక్కోవటంతో కాదు — కాని సరైన భాగస్వామిగా ఉండటం ముఖ్యమని గ్రహించాను."

"ఔను" అన్నట్లు ఆమె ముఖం ఎత్తి ఆతడి కళ్ళలోకి ఆరాధనగా చూచింది.

ఆమె వజ్రపు ముక్కుపుడక దేదీప్యమానమైన సప్త వర్ణ కాంతిపుంజాల్ని వెదజల్లింది.

[అ యి పో యి ం ది]


నవజ్యోతి వారి నవలా కుసుమాలు







రాయిలాంటి ఆడది ...... 15.00
(ఆంధ్రప్రభ సీరియల్)
దమయంతీ హరికిషన్

ఉచితం
సర్పవిజ్ఞానం

శ్వేతనాగు ...... 20.00
(ఆంధ్రప్రభ సీరియల్)
లల్లాదేవి

రాగలహరి ...... 12.00
(ఆంధ్రపత్రిక సీరియల్)
మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద

ఛాలెంజి ...... 12.00
మాయ ...... 13.50
జొన్నలగడ్డ లలితాదేవి

అన్ని బుక్‌షాపుల్లోనూ దొరుకుతాయి. లేదా కోరిన పుస్తకాల విలువలో రూపాయి తగ్గించి M.O. పంపితే మిగిలిన మొత్తానికి V.P.P.లో పంపుతాము.

నవజ్యోతి పబ్లికేషన్స్

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్ విజయవాడ-2